ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

బుధవారం 17 జూన్ 2026 | Wednesday 17 June 2026 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 76 | Vol.No 28 Issue No .76 | www.visionandhra.in

## సన్నరకం వరి విత్తనాలు సిద్ధం చేయండి

- రైతు వేదికల వద్ద అందుబాటులో ఉంచండి
- సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించండి
- వ్యవసాయంలో కూడా ఎఐ, టెక్నాలజీ వినియోగం పెరగాలి
- వ్యవసాయ వర్సిటీ నోడల్ ఏజెన్సీగా సాంకేతిక సహకారం
- వ్యవసాయరంగంపై ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ సూచన





హైదరాబాద్,జూన్16 : ధాన్యం దిగుబడిపైన వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. నిర్దేశించిన వరిరకాల విత్తనాలను రైతు వేదికలో అందుబాటులో ఉంచాలని మార్గనిర్దేశం చేశారు. సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించాలని ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ ఎంసీఆర్‌హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. బోనస్ ఇచ్చే 7 రకాల సన్న వడ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 7 రకాల సన్న వడ్లను సబ్సిడీపైన ఇవ్వాలని మార్గనిర్దేశర చేశారు. భద్రాద్రి కొత్తగూడం దమ్మపేట మండలంలో ప్రారంభించిన పైలెట్ ప్రాజెక్ట్‌ను మరింతగా వినియోగించుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖలో సాంకేతికతను మరింతగా పెంచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఏఐని మరింతగా మిగతా 2లో..

## తెలంగాణ అభివృద్ధిపై మాకెవరి పాఠాలు అవసరం లేదు

- తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి పట్ల మా చిత్తశుద్ధి మాకుంది
- హైదరాబాద్ మెట్రోకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం
- తాము అడ్డుకుంటే ప్రాజెక్టులు ఎక్కడా ఆగవు
- అన్ని విధాలుగా అనేక కార్యక్రమాలు చేపట్టాం
- రేవంత్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించన కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ,జూన్16 : తెలంగాణ అభివృద్ధిపై తమకెవరూ పాఠాలు చెప్పాల్సిన పనిలేదని, ఎవరి కోసమో తాము తెలంగాణ అభివృద్ధికి పాటుపడడం లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా మిగతా మెట్రో రైలు ప్రాజెక్టుల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్ర ప్రభుత్వం సహకారమందిస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు. సాంకేతిక, ఆర్థిక విషయాలపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తే ప్రాజెక్టులు సాకారమవుతాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విమర్శల నేపథ్యంలో దిల్లీలో మిగతా 2లో..

## అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం

- అయినా పలు రకాల అనుమానాలు చక్కర్లు
- ఇరాన్‌కు 300 మిలియన్ డాలర్ల పరిహారం అంటూ వార్తలు
- అలాంటిదేమీ లేదని ట్రూత్‌లో వెల్లడించిన ట్రంప్
- అణ్వాయుధాలపై ఖచ్చితమైన ఒప్పందం కోసం పట్టు మిగతా 2లో..




## హర్మూజ్ ఇక టోల్ ఫ్రీ ఏరియా

- నౌకలు స్వేచ్ఛగా వెళ్లేందుకు అనుమతి
- శుక్రవారం నాటికి పూర్తిగా తెరుచుకుంటుంది
- ఇరాన్‌పై కుదిరిన ఒప్పందాన్ని త్వరలో వెల్లడిస్తా
- జి 7 సదస్సులో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక ప్రకటన



ప్యారిస్,జూన్16 :ఫ్రాన్స్‌లో జీ 7 సదస్సు వేదికగా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. హార్ముజ్ శాశ్వతంగా టోల్ రహితంగా ఉంటుందని వెల్లడించారు. సమ్మిట్‌ను ఉద్దేశించి ట్రంప్ ప్రసంగం చేశారు. ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధి శుక్రవారం నాటికి పూర్తిగా తెరుచుకుంటుందని.. ఇకపై అది శాశ్వతంగా మిగతా 2లో..

## రాష్ట్రవ్యాప్తంగా ఈగిల్ ఫోర్స్ దాడులు

- గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా,
- 19మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు,
- 14మందికి గంజాయి పాజిటివ్‌గా గుర్తింపు



హైదరాబాద్,జూన్16 : తెలంగాణలోని వివిధ కమిషనరేట్ల పరిధిలో గంజాయి, డ్రగ్స్ వినియోగంపై భారీగా ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో మంగళవారం ఈగల్ మిగతా 2లో..

## పారదర్శకంగా యూరియా పంపిణీ

- ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఇంటినుంచే బుకింగ్
- ఇప్పటికే 4.06 లక్షల మంది రైతులకు లబ్ది
- క్యూ లైన్లు కట్టాల్సిన దుస్థితి రాకుండా నిర్ణయం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



కామారెడ్డి,జూన్16 :రైతులకు పారదర్శకంగా యూరియా పంపిణీ చేస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మంగళవారం కామారెడ్డి మిగతా 2లో..

## బిజెపికి లబ్ది చేకూర్చేలా సర్ ప్రక్రియ

- కేంద్రానికి తొత్తుగా మారిన ఎన్నికల సంఘం
- బెంగాల్లో 92 లక్షల ఓట్ల తొలగింపే నిదర్శనం
- బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో పిసిసి చీఫ్ విమర్శలు



సంగారెడ్డి,జూన్16 : కేవలం బిజెపికి లాభం చేకూర్చేలా సర్ ప్రక్రియ సాగుతోందని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మతతత్వ పార్టీలకు ప్రయోజనం చేకూరేలా ఎస్ఐఆర్ పక్రియ నిర్వహించే కుట్ర జరుగుతుందని విమర్శించారు. మంగళవారం మిగతా 2లో..

## అన్నలు లేరని అలుసు తీసుకుంటే ఖబర్దార్

- ఇప్పుడు వారంతా మా పార్టీలోనే ఉన్నారు
- సింగరేణిలో అక్రమాలను నిలదీస్తూనే ఉంటాం
- బొగ్గుబాయి బాటలో కవిత వెల్లడి



మంచిర్యాల,జూన్16 : తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత తలపెట్టిన భూగర్భగని వద్ద 'బొగ్గుబాయి' కార్యక్రమంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7 గని ఆవరణలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన కవిత, టీఆర్ఎస్ శ్రేణులు, కార్మికసంఘం నాయకులను పోలీసులు మిగతా 2లో..

## అద్భుత నగరంగా అమరావతి నిర్మాణం

- అంతర్జాతీయ మౌలిక వసతులతో తీర్చిదిద్దుతున్నాం
- పీపుల్ ఫస్ట్ మా విధానంలో నాలెడ్జ్ సిటీగా చేస్తున్నాం
- జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థల ఏర్పాటు
- క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రత్యేక ఆకర్షణలు
- లీడర్‌షిప్ ప్లీనరీ-2లో చంద్రబాబు ప్రసంగం




అమరావతి,జూన్16 :పీపుల్ ఫస్ట్ మా విధానమని... ఈక్విటీ, నేచర్, ఆపర్చునిటీ, లివబుల్ సిటీగా అమరావతి ఉంటుందని సీఎం చంద్రబాబు తెలిపారు. అంతర్జాతీయ మౌలిక వసతులతో, అవకాశాల వేదికగా అమరావతిని తీర్చిదిద్దుతున్నామన్నారు. సింగపూర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. 'వరల్డ్ సిటీస్ సమ్మిట్'లో పాల్గొన్న సీఎం.. లీడర్‌షిప్ ప్లీనరీ-2లో 'కెన్ స్మార్ట్ సిటీస్ లవ్ హ్యూమన్స్' అనే అంశంపై ప్రసంగించారు. అమరావతిని నాలెడ్జ్ సిటీగా చేస్తున్నామని.. జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలను తీసుకువస్తున్నామని అన్నారు. క్వాంటం కంప్యూటింగ్ హబ్, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రత్యేక ఆకర్షణలన్నారు. మిగతా 2లో..

## ఆదాయానికి మించిన ఆస్తులు

- ల్యాండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ నరహరి ఇంట్లో ఎసిబి సోదాలు
- భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తింపు




హైదరాబాద్,జూన్16 :ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే పక్కా సమాచారంతో ల్యాండ్ అండ్ సర్వే మిగతా 2లో..

## వైసిపి ఓట్లను తొలగించే కుట్రలో చంద్రబాబు

- సర్ ప్రక్రియపై నాలుగు వారాలు అప్రమత్తంగా ఉండాలి
- ఫిర్యాదులు వస్తే వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి
- పార్టీ సీనియర్ నేతలు, ముఖ్య నాయకులతో సమీక్షలో జగన్



అమరావతి,జూన్16 : రాబోయే నాలుగు వారాలు అత్యంత కీలకమని పేర్కొంటూ సర్ ప్రక్రియ పట్ల పార్టీ శ్రేణులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ మిగతా 2లో..

## జనసేనలో జాయినింగ్స్ కమిటీ ఏర్పాటు

- పార్టీలో చేరేవారి కోసం 14మందితో కమిటీ,
- పార్టీ అధినేత పవన్ కల్యాణ్ వెల్లడి



అమరావతి,జూన్16 : జనసేన పార్టీలో చేరికల సమన్వయానికి జాయినింగ్స్ కమిటీని నియమించినట్లు పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. జనసేన పార్టీలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్న ఇతర పార్టీల నేతలు, విద్యావంతులు, సామాజికవేత్తలు, తటస్థులను పార్టీలోకి ఆహ్వానించేందుకు ప్రత్యేకంగా ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 14 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీ చేరికలను సమన్వయం చేస్తుందన్నారు. ఢిల్లీ పర్యటన అనంతరం ఈ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి పార్టీలో చేరికలపై దిశానిర్దేశర చేయనున్నట్లు పవన్ మిగతా 2లో..

## బీసీలపై కక్షపూరిత చర్యలకు పాల్పడ్డ జగన్

- అమర్‌నాథ్ గౌడ్ హత్యే ఇందుకు నిదర్శనం
- మంత్రి లోకేశ్ ఘాటు విమర్శలు



అమరావతి,జూన్16 : జగన్ హయాంలో బీసీలకు అన్యాయం జరిగిందని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఫైర్ అయ్యారు. వైసీపీ హయాంలో మిగతా 2లో..

## సిఎం రేవంత్ వ్యాఖ్యలపై బండి ఆగ్రహం

మెట్రోను అడ్డుకునే ఖర్మ కిషన్‌రెడ్డికి లేదని వెల్లడి



కరీంనగర్,జూన్16 : తెలంగాణ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. మెట్రో విస్తరణను అడ్డుకోవాల్సిన ఖర్మ పట్టలేదన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మెట్రో ప్రాజెక్టును అడ్డుకోవాల్సిన అవసరం కిషన్ రెడ్డికి లేదన్నారు. అర్థంలేని ఆరోపణలను పట్టించుకోవాల్సిన మిగతా 2లో..

## గంజాయి పట్టివేత

# ఐదుగురు వ్యక్తులు అరెస్ట్



భూపాలపల్లి జిల్లా 16 జూన్ ( విజన్ ఆంధ్ర ): భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్ ఆదేశాల మేరకు సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో సీసీఎస్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బాంబులగడ్డ ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న గడ్డిగానిపల్లికి చెందిన సెగ్గం సాయి వర్ధన్, సెగ్గంపల్లికి చెందిన దాసరి వంశీ, దుర్గం మహార్షిలను అదుపులోకి తీసుకుని విచారించగా. వారు ఇచ్చిన సమాచారంతో గంజాయి సరఫరా చేస్తున్న ములుగు జిల్లా, ఏటూరునాగారం మండలం, రొయ్యూరు గ్రామానికి చెందిన జాడి మనోజ్, దుర్గం కిరణ్‌లను కూడా అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుండి మొత్తం 210 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసు నమోదు నిమిత్తం భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు కొనసాగుతాయని, గంజాయి విక్రయాలు, రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

# బాధితుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోండి

**మల్టీ జోన్-2 ఐజీపీ షానవాజ్ ఖాసీం**
**వనపర్తి జిల్లా పోలీసు పనితీరుపై**
**ఐజీపీ సమగ్ర సమీక్ష**
**ప్రతి కేసు వివరాలను సకాలంలో**
**సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేయాలి**
**నూతన సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి**
**అవగాహన పెంపొందించుకోవాలి**
**శాంతిభద్రతల పరిరక్షణలో జిల్లా పోలీసుల**
**పనితీరుపై ఐజీపీ ప్రశంసలు**






వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 16 (విజన్ ఆంధ్ర): ప్రజలకు న్యాయం అందించడంలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తుందని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునికి 'పోలీసులు అండగా ఉన్నారు' అనే నమ్మకాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందని మల్టీ జోన్-2 హైదరాబాద్ ఐజీపీ షానవాజ్ ఖాసీం పేర్కొన్నారు. మంగళవారం ఆయన జోగులాంబ జోన్-7 డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ తో కలిసి వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు పనితీరుపై అధికారులతో కలిసి సమగ్ర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీపీ మాట్లాడుతూ... ప్రజల సమస్యలను ఓర్పుతో విని, సత్వర పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. మర్యాదపూర్వకంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించడం ద్వారా పోలీసు-ప్రజా సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆయన తెలిపారు. జిల్లాలో నమోదైన యూఐ, గ్రేవ్, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ, పోక్సో, కాంటెస్టెడ్ కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల పురోగతిపై ఐజీపీ సుదీర్ఘంగా సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తుపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోక్సో మరియు ఎస్సీ/ఎస్టీ కేసుల్లో 60 రోజులలోపు దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. ప్రతి కేసుకు స్పష్టమైన “ప్లాన్ ఆఫ్ యాక్షన్“ ఉండాలన్నారు. రౌడీ షీటర్లు, కేడీలు, అనుమానితుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించాలని, రాత్రి గస్తీని మరింత పటిష్టం చేయాలని ఐజీపీ ఆదేశించారు. లాడ్జీలు, పాత నేరస్తులపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలన్నారు. పోలీసు అధికారులు, వీఆర్వోలు, బీట్ అధికారులు క్రమం తప్పకుండా గ్రామాలను సందర్శిస్తూ అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ రికార్డులను నిరంతరం నవీకరిస్తూ ఎలాంటి పెండెన్సీ లేకుండా ప్రతి కేసు వివరాలను సకాలంలో సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. రికార్డుల నిర్వహణలో '5ఎ' విధానాన్ని అమలు చేయాలన్నారు. సాయంత్రం వేళల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని, రాత్రి గస్తీల ద్వారా ఆర్థిక నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా ఎస్పీ సునిత రెడ్డి చేపడుతున్న చర్యలపై ఐజీపీ సంతృప్తి వ్యక్తం చేస్తూ, జిల్లా పోలీసుల పనితీరును అభినందించారు. అంతకుముందు జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఐజీపీ, డీఐజీకి పూలమొక్కలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఐజీపీ సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్ష అనంతరం ఐజీపీ వనపర్తి జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించారు. వనపర్తి డిఎస్పీ గిరిబాబు, ఐజీపీకి పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిఎస్పీ కార్యాలయ ఆవరణలో ఐజీపీ మొక్కలు నాటారు. గతంలో తాను వనపర్తి ఏఎస్పీగా పనిచేసిన రోజుల నాటి జ్ఞాపకాలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ సమీక్షా కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) రాజేష్ మీనా, ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, వనపర్తి డీఎస్పీ గిరిబాబు, జిల్లా పోలీసు కార్యాలయ ఏఓ సునంద, స్పెషల్ బ్రాంచ్ సీఐ నేరేష్, వనపర్తి సీఐ సుగంధ రత్నం, కొత్తకోట సీఐ రాంబాబు, ఆత్మకూరు సీఐ శివకుమార్, సీసీఎస్ సీఐ అశోక్ కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తో పాటు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి సొసైటీకి యూరియా నిల్వల కేటాయింపులు

**రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా**
**బుకింగ్ యాప్ ద్వారా పారదర్శకంగా పంపిణీ**
**రైతు వేదికల ద్వారా కూడా యూరియా**
**పంపిణీకి ఏర్పాట్లు**
**ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి**
**కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి**



నిజామాబాద్, జూన్ 16 : (విజన్ ఆంధ్ర )జిల్లాలోని అన్ని సహకార సంఘాలలో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఖరీఫ్ సీజన్ పంటల సాగుకు అవసరమైన మేరకు పూర్తి స్థాయిలో ఎరువుల నిల్వలు జిల్లాకు కేటాయించబడ్డాయని అన్నారు. అన్ని సొసైటీలకు ఎరువులను చేరవేస్తూ, ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా రైతులకు పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా పంపిణీ జరిగేలా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నందున ఎక్కడ కూడా ఎరువుల కొరత ఏర్పడకుండా రైతుల అవసరాలకు అనుగుణంగా అన్ని ప్రాంతాలకు యూరియా బస్తాలను కేటాయిస్తున్నామని వివరించారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ కు సంబంధించి జిల్లాలో లక్షా 39 వేల మంది రైతులకు బుకింగ్ యాప్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా 3.78 లక్షల బస్తాల యూరియా ఎరువు పంపిణీ జరిగిందని వెల్లడించారు. ఒక్కో ఎకరానికి రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేస్తున్నామని అన్నారు. 3 ఎకరాల వరకు విస్తీర్ణం కలిగిన రైతులకు రెండు విడతలలో యూరియా కేటాయించబడుతోందని, ఐదు ఎకరాల వరకు 40:30:30 నిష్పత్తిలో మూడు విడతల్లో, ఐదు ఎకరాలు పైబడి విస్తీర్ణం కలిగిన వారికి 40:20:20:20 నిష్పత్తిలో నాలుగు విడతలలో యూరియా విక్రయాలు జరిపేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు. ఆన్లైన్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్న 24 గంటల లోపు సంబంధిత సొసైటీ లేదా డీలర్ షాప్ నుండి యూరియా కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు. యూరియా ఎరువుల విషయమై రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని, జిల్లాలో ఇప్పటికే ఇంకనూ 28వేల మెట్రిక్ టన్నుల స్టాక్ ఉందని కలెక్టర్ భరోసా కల్పించారు. కాగా, ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ప్రభుత్వ రాయితీలు పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ కీలకం కానుందని సూచించారు.

# మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్, జూన్ 16 : (విజన్ ఆంధ్ర )ప్రభుత్వం నిర్దేశించిన మేరకు కామన్ డైట్ మెనూను అనుసరిస్తూ విద్యార్థులకు నాణ్యతతో, పరిశుభ్రతతో కూడిన పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. డిచ్పల్లి మండలం సుద్దపల్లి లోని సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ మంగళవారం సందర్శించారు. సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేశారు. కిచెన్, డార్మెటరీ, డైనింగ్ హాల్ లను పరిశీలించి సదుపాయాలను గమనించారు. పుస్తకాలు, నోట్ బుక్కులు పూర్తి స్థాయిలో వచ్చాయా అని ఆరా తీశారు. బాలికల కోసం వండిన అన్నం, పప్పు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం దృష్ట్యా పరిసరాలతో పాటు కిచెన్, డైనింగ్ హాల్ లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. బాలికల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, తల్లిదండ్రులు, సంరక్షకులు వస్తేనే వారితో పంపాలని సూచించారు. ఎక్కువ రోజుల పాటు పాఠశాలకు హాజరు కాని విద్యార్థినుల పట్ల ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, వారు ఎందుకు పాఠశాలకు రావడం లేదనే విషయాన్ని ఆరా తీయాలన్నారు. పాఠశాలలో పెండింగ్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ పనులను తక్షణమే చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పెండింగ్ నిర్మాణాలను పూర్తి చేసి విద్యార్థులకు అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అనంతరం సెకండియర్ క్లాస్ రూమ్ కు వెళ్లి విద్యార్థినులకు పలు సబ్జెక్టులలో ప్రశ్నలు వేస్తూ, సమాధానాలు ఇచ్చిన వారికి బహుమతులు అందజేశారు. చక్కగా చదువుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ఇంచార్జి ప్రిన్సిపాల్ స్వప్న, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

# ఆధ్యాత్మిక తీర్థయాత్రా కేంద్రంగా ఓదెల!!

**ప్రభుత్వం చేసిన మహత్తర నిర్ణయం**
**15 కోట్లతో భవ్య పునరుద్ధరణ,**
**సర్వాంగ సుందరం**
**మాస్టర్ ప్లాన్ ఆవిష్కరణ, “విప్“కు వివరణ**
**ఓదెల మల్లన్న క్షేత్రం ఇక మరో**
**స్థాయిలోకి వెళ్తుంది**
**విప్ విజయ రమణరావు**





పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 16 (విజన్ ఆంధ్ర): తెలంగాణలోని పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రసిద్ధి చెందిన ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం భారీ మేరకు నిధులు మంజూరు చేసి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో మొత్తం 15 కోట్ల రూపాయలు కేటాయించడం ఆధ్యాత్మిక వర్గాల్లో హర్షం కలిగించింది. ఇందులో ప్రభుత్వం నుంచి 10 కోట్లు, ఆలయ ప్రత్యేక నిధుల నుంచి 5 కోట్లు సమకూర్చబడగా, ఈ నిధుల సాయంతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా, అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దేందుకు ప్రముఖ స్థపతి వల్లినయాగన్ రూపొందించిన విశాల మాస్టర్ ప్లాన్‌ను హైదరాబాద్ బొగ్గులకుంటలోని ధార్మిక భవన్‌లో దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయంలో అధికారులు ఆవిష్కరించారు, ఈ మాస్టర్ ప్లాన్ వివరాలను ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావుకి సంబంధిత అధికారులు వివరంగా వివరించి ఆలయ అభివృద్ధి దిశలో ముఖ్యమైన అడుగులు వేశారు. ఈ కార్యక్రమం ద్వారా ఓదెల మల్లన్న క్షేత్రం తెలంగాణ రాష్ట్రంలో మరో ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రంగా భవిష్యత్తులో వెలుగొందుతుందని విప్, భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఆలయం సమగ్ర అభివృద్ధి చెందడం వల్ల భక్తుల సంఖ్య పెరిగి, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతం లభించనుంది అని రమణరావు తెలిపారు. ఓదెల మల్లన్న క్షేత్రం ఇక మరో స్థాయిలోకి వెళ్తుంది అని సంతోషం వ్యక్తం చేశారు.

# ఆర్జీ3 సింగరేణి అధికారులపై అసహనం!!

**డ్రాగ్‌లైన్ దొంగతనం వివాదంపై**
**“శ్రీజా కంపెనీ“ ఆరోపణలు**
**ఎఫ్ఐఆర్‌లో రూ.1 లక్ష..**
**రికవరీ రూ.16 లక్షలు**
**నిష్పక్షపాత విచారణ కోరిన**
**బాధిత కాంట్రాక్టర్**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 16 (విజన్ ఆంధ్ర): సింగరేణి ఆర్జీ త్రీ ఏరియాలో జరిగిన డ్రాగ్‌లైన్ స్క్రాప్ దొంగతనం కేసు ఇప్పుడు పెద్ద వివాదానికి దారితీస్తోంది. శ్రీజా ఇన్ఫ్రా సెక్యూరిటీ సర్వీసెస్ కాంట్రాక్టర్ రవి కుమార్ మంగళవారం సెంటినరీ కాలనీలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో జరిగిన మీడియా సమావేశంలో కన్నీటి గాథను వినిపిస్తూ, తనపై మోపిన రూ.16 లక్షల రికవరీ నిర్ణయం పూర్తిగా అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ ఏప్రిల్ 15, 2026న ముగిసిన తర్వాత ఆరు రోజులకు జరిగిన ఘటనకు తాను బాధ్యుడిగా చూపించడం వెనుక కక్షపూరిత ధోరణి ఉందని ఆయన ఆరోపించారు. కాంట్రాక్ట్ ముగిసినట్లు ఏరియా సెక్యూరిటీ కార్యాలయం అధికారికంగా లేఖ జారీ చేసినప్పటికీ, ఏప్రిల్ 21, 2026న జరిగిన దొంగతనానికి తనను బలిపశువుగా మార్చే ప్రయత్నం జరుగుతోందని బాధితుడు వేదనతో చెప్పారు. దొంగతనంలో పేర్లు వచ్చిన గార్డులు శ్రీజా ఇన్ఫ్రా సిబ్బంది కాదని, వారు గత ఆరు సంవత్సరాలుగా ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న వారేనని స్పష్టంచేశారు. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో దొంగిలించబడిన స్క్రాప్ విలువ రూ.1 లక్షగా పేర్కొనగా, ఏరియా సెక్యూరిటీ అధికారులు ఎటువంటి విచారణ లేకుండా రూ.16 లక్షల రికవరీ విధించడం అనుమానాస్పదమని ఆయన వేదన వ్యక్తం చేశారు. సహజ న్యాయ సూత్రాలను పక్కన పెట్టి తన వివరణ తీసుకోకుండా, ముందస్తు నోటీసు ఇవ్వకుండా భారీ మొత్తాన్ని రికవరీ చేయడం వెనుక భద్రతా వైఫల్యాన్ని కప్పిపుచ్చే ప్రయత్నమేనని ఆయన ఆరోపించారు. ఒక అమాయక కాంట్రాక్టర్‌ను బలిపశువుగా మార్చి, నిజమైన బాధ్యులను కాపాడే ప్రయత్నం జరుగుతోంది అని బాధితుడు కన్నీటి గళంతో మాట్లాడారు. తనపై విధించిన రికవరీ ఉత్తర్వులను వెంటనే రద్దు చేసి, నిష్పక్షపాత విచారణ జరిపి న్యాయం చేయాలని సింగరేణి సీఎండీ, విజిలెన్స్ అధికారులను వేడుకున్నారు.

# గ్రామాల్లో అభివృద్ధి పనులు నాణ్యతతో, గడువులోపు పూర్తి చేయాలి

## అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్





వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 16 (విజన్ ఆంధ్ర): వనపర్తి మండలంలోని నాగమ్మ తండా గ్రామ పంచాయతీని జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మంగళవారం సందర్శించి పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయతీ భవనం, వీవో భవనాల పనులను పరిశీలించి నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ఏఈ (పీఆర్) అధికారికి సూచించారు. పనుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, నిర్మాణ నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అనంతరం గ్రామ నర్సరీని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్, నర్సరీ నిర్వహణను మరింత మెరుగుపరచాలని సూచించారు. మొక్కల సంరక్షణ, వాటి పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఫీల్డ్ ఆఫీసర్, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో నర్సరీల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ), ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శి, ఏఈ (పీఆర్) తదితర అధికారులు పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు కూడా హాజరయ్యారు.

# గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

**ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన**
**విద్యను బోధించాలి:**
**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా,జూన్ 16,(విజన్ ఆంధ్ర); గ్రామీణ ప్రాంతాల ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.నర్సాపూర్ (జి) మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆసుపత్రిలో గల మందుల గది, ఇంజక్షన్ గది, ఓపి విభాగం, ఇన్ పేషంట్, ఔట్ పేషెంట్, విభాగాలు, పలు వార్డులు పరిశీలించారు. ఆసుపత్రికి సంబంధించిన మందులు, ఓపీ, తదితర రిజిస్టర్లను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సమయపాలన పాటిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ, వైద్య సేవలు అందించాలని తెలిపారు. అనంతరం కేజీబీవీ వసతి గృహాన్ని పరిశీలించారు. అధికారులు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ వసతి గృహంలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారో లేదో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంచాలని అన్నారు. ప్రతిరోజు విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని తెలిపారు. విద్యార్థులకు పుస్తకాలు, దుప్పట్లను పంపిణీ చేశారు. మోతాక్ పల్లి గ్రామం సుద్ద వాగులో ఇసుక రీచ్ ను పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లో ఇసుక అక్రమ రవాణా జరగకూడదన్నారు. నిత్యం ప్రత్యేక నిఘా ఉంచి ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. వాహనాలను జప్తు చేయాలని ఆదేశించారు. కేవలం మన ఇసుక వాహనం యాప్ ద్వారానే ఇసుక అమ్మకాలు జరగాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడే విధంగా ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ తనిఖీలలో డిఈవో భోజన్న, తహసిల్దార్లు శ్రీకాంత్, ఎంపీడీవో పుష్పలత, ఆసుపత్రి వైద్యాధికారి ప్రమోద్ చంద్రరెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## మొబైల్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకొని యూరియా పొందాలి - కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి బ్యూరో జున్ 16(విజన్ఆంధ్ర): రైతులు మొబైల్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకొని యూరియా ఎరువులను పొందాలని జిల్లా కలెక్టర్ సూచించారు. లింగం పేట మండలంలోని పోతాయిపల్లి గ్రామంలో యూరియా బస్తాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. యూరియా పంపిణీలో పారదర్శకత, సౌలభ్యం కోసం అమలు చేస్తున్న మొబైల్ యాప్ ద్వారా రైతులు ముందస్తుగా స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. దీంతో రద్దీ తగ్గడంతో పాటు రైతులు నిర్ణీత సమయంలో ఎరువులు పొందగలరని తెలిపారు. మొబైల్ యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు అవసరమైన సహాయ సహకారాలు అందించి స్లాట్ బుకింగ్ ప్రక్రియను సులభతరం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించి పంటల దిగుబడిని పెంచుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, ఎంఎస్వో, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో, ఏఈ (ఆర్‌డబ్ల్యూఎస్), విద్యుత్ శాఖ అధికారులు, ఎంఈవో, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పరిశుభ్రతపై ఇంత నిర్లక్ష్యమా....

## పునరావృతమైతే చర్యలు తప్పవు : కలెక్టర్ దివాకర్

## విజన్ ఆంధ్ర ఎఫెక్ట్....

## స్పందించిన కలెక్టర్

## విశ్వనాథపల్లి పాఠశాల ఆకస్మిక తనిఖీ



కారేపల్లి,జూన్ 16(విజన్ ఆంధ్ర): కారేపల్లి మండల పరిధిలోని విశ్వనాథపల్లి ప్రాథమిక పాఠశాలలో పాఠశాల ప్రారంభమైన మొదటి




రోజే మౌలిక సదుపాయాల లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తుందనే విజన్ ఆంధ్ర దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి ఖమ్మం జిల్లా కలెక్టర్ స్పందించారు. మంగళవారం విశ్వనాథపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. మరుగుదొడ్లను పరిశీలించి ఆగ్రహం ఈ వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులే పాఠశాలలని, అలాంటి పాఠశాలలు కనీస అవసరాలైన మంచినీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్వహణ దారుణంగా ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. పాఠశాలలకు ప్రత్యేక నిధులను సైతం అమలు చేస్తున్నప్పటికీ, నిర్లక్ష్యంగా ఎందుకు వ్యవహరిస్తున్నారనీ అధికారులను ప్రశ్నించారు. పాఠశాల నిర్వహణ, పరిసరాలపై ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు. మొదటి రోజైన



పాఠశాలలో పారిశుధ్యం పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా అంటూ.. ప్రజల నుండి ఫిర్యాదులు వచ్చే పరిస్థితికి దిగజారకూడదని, ఇకపై ఇలాంటి సంఘటన పునరావృతం కాకూడదని, తన దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పారిశుద్ధ్య, పాఠశాల నిర్వహణ పై పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని అధికారులకు సూచించారు. ఇదిలా ఉండగా పాఠశాలపై వచ్చిన కథనం మేరకు కలెక్టర్ పర్యటనను తెలుసుకున్న స్కూల్ యాజమాన్యం, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పారిశుధ్య పనులను, కొత్త వాటర్ ట్యాపులను అమర్చారని స్థానికులు తెలపడం కొస మెరుపు. అధికారులు పర్యటిస్తేనే పాఠశాలలో మార్పులు, అభివృద్ధి పనులు జరుగుతాయంటే వ్యవస్థ ఎంత బలహీనంగా పనిచేస్తుందో కళ్లకు కట్టినట్టు కనిపిస్తుందని స్థానికులు బహిరంగంగా చర్చించుకోవడం చర్చనీయాంశమైంది. కలెక్టర్ వెంట మండల తాసిల్దార్ వెంకటేశ్వర్లు, మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నరేందర్ రావ్, స్థానిక సర్పంచ్ రాజు, కార్యదర్శి నాగలక్ష్మి స్థానికులు తదితరులు ఉన్నారు.

# నమ్మకం అభివృద్ధి సంక్షేమం

# మోదీ 12 ఏళ్ల సుపరిపాలన!

## వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 'స్వచ్ఛ భారత్' కార్యక్రమం

## ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మ రెడ్డి




హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 16 ( విజన్ ఆంధ్ర ): భారత ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాటు (4,399 రోజులు) దేశ ప్రధానిగా దేశ ప్రజలకు నిరంతర సేవలందిస్తూ, సరికొత్త చరిత్ర లిఖించిన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని 4వ డివిజన్ బాసిత్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో "స్వచ్ఛ భారత్" కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారు. జిల్లా కౌన్సిల్ సభ్యులు గొర్రె ఓం ప్రకాశ్ మరియు డివిజన్ అధ్యక్షులు బాల్నే రేవంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సేవా కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రావు పద్మ రెడ్డి మాట్లాడుతూ: నమ్మకం, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా దేశంలో మోదీ 12 ఏళ్ల సుపరిపాలన సాగింది. ప్రధాని మోదీ దేశాన్ని ప్రపంచ అగ్రగామిగా నిలిపేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఆయన స్ఫూర్తితోనే ఈరోజు పాఠశాల పరిసరాలను శుభ్రం చేసి, 'స్వచ్ఛతే సేవ' అనే గొప్ప సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం జరిగింది. మోదీ అద్భుత పాలనకు సంఘీభావంగా రాబోయే రోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించబోతున్నాం."ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ కార్యదర్శి కేతిపల్లి సంపత్ రెడ్డి, 9వ డివిజన్ అధ్యక్షులు కస్తూరి నవీన్ స్థానిక డివిజన్ బీజేపీ నాయకులు ఏడుకొండలు, వాణి, మహేందర్, కార్యకర్తలు, తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా రావు పద్మ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## బాధిత మహిళలకు అండగా 'భరోసా' కేంద్రాలు -అడిషనల్ డీసీపీ రామానుజం

ఖమ్మం జిల్లా బ్యూరో, జూన్ 16 (విజన్ ఆంధ్ర) : చిన్నారులపై హింసను అరికట్టడానికి, బాధిత మహిళలకు సమగ్ర సేవలను అందించడానికి 'భరోసా' కేంద్రాలు అత్యంత సమర్థవంతంగా పనిచేస్తూ... అండగా నిలుస్తున్నాయని అడిషనల్ డీసీపీ రామానుజం అన్నారు. హింస, లైంగిక వేధింపులకు గురైన బాధిత మహిళలకు, చిన్నారులకు భరోసా కేంద్రాల ద్వారా అందించే సహాయాన్ని, పునరావాస సేవలను బలోపేతం చేయడం కోసం వివిధ శాఖల అధికారుల భాగస్వామ్యంతో సమన్వయ సమావేశం పోలీస్ కమిషనర్ కార్యాలయం కాన్ఫిరెన్స్ హాల్లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అధికారులకు పలు మార్గదర్శకాలు అడిషనల్ డీసీపీ సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...సమాజంలో దగా పడ్డ మహిళలకు అండగా నిలవడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాల ద్వారా పోలీస్, వైద్య, న్యాయ,మానసిక కౌన్సెలింగ్ సేవలను ఒకే గొడుగు కిందకు తీసుకురావడంతో వేధింపులకు గురైన బాధితులకు మరల ఇటువంటి వాటి బారిన పడకుండా చూడడమే భరోసా సంస్థ యొక్క ముఖ్య లక్ష్యమన్నారు. లైంగిక వేధింపులు, గృహ హింస గురైన మహిళలు, పిల్లలకు తక్షణ రక్షణ, న్యాయ, వైద్య, కౌన్సెలింగ్, పునరావాస సేవలను అందించడంలో భరోసా కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని అన్నారు. బాధితులకు చేయూతనిచ్చే ఈ సేవల సమర్థవంతమైన నిర్వహణకు గాను పోలీసు,రెవిన్యూ, వైద్య, న్యాయ, మహిళా శిశు సంక్షేమ శాఖల తదితర అధికారులందరూ ఒకే ప్రాంగణంలో ఉండి బాధితులకు అవసరమైన అన్ని సేవలను సమన్వయంతో అందిస్తారన్నారన్నారు. పోలీస్ స్టేషన్, కోర్టుల వాతావరణానికి దూరంగా, బాధితులకు ఎలాంటి భయం




లేకుండా సురక్షితమైన, గోప్యమైన వాతావరణంలో సాయం అందేలా చూస్తారన్నారు. బాధిత మహిళలు, పిల్లలకు అవసరమైన ప్రాథమిక వైద్య పరీక్షలు, చికిత్స అందించడంతో పాటు నిపుణులైన సైకాలజిస్టుల ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి మనోధైర్యాన్ని నింపుతారన్నారని తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు నుండి కోర్టు విచారణ పూర్తయ్యే వరకు న్యాయ నిపుణులు ద్వారా బాధితులకు ఉచిత న్యాయ సహాయాన్ని అందించి న్యాయం జరిగేలా చూస్తారన్నారు. బాధితుల కోసం స్వల్పకాలిక ఆశ్రయం, చదువుకునే సౌకర్యం కల్పించడంతో పాటు, స్వయం ఉపాధి శిక్షణ ద్వారా వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా తోడ్పాటును అందిస్తారన్నారు. సమావేశంలో ×జూా అధికారులు,, చైల్డ్ లైన్ ప్రతినిధులు,జఔజ & జేజేబు సభ్యులు, సభ్యులు, ఖూూా ప్రతినిధులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, ౧ాజు౯ా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, కౌన్సిలర్లు, దర్యాప్తు అధికారులు పాల్గొన్నారు.

## చిన్నారులకు అక్షరాభ్యాసం చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి బ్యూరో జూన్ 16(విజన్ఆంధ్ర): బడిబాట కార్యక్రమం లో భాగంగా విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ, సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్. లింగంపేట మండలంలోని శెట్పల్లి జడ్.పి.హెచ్.ఎస్, అంగన్వాడీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసి వారి విద్యాభివృద్ధికి అవసరమైన ప్రోత్సాహాన్ని అందించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి పలక, బలపాలను అందజేశారు. చిన్ననాటి నుంచే విద్యపై ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రతి చిన్నారి నాణ్యమైన విద్యను పొందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల హాజరు, అభ్యాస నైపుణ్యాల పెంపు, ప్రాథమిక విద్య బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం విద్యా రంగంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని సన్మానించి అభినందించారు. అనంతరం



గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ నియంత్రణ కేంద్రాన్ని సందర్శించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తూ, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక కిరాణా దుకాణాల యజమానులకు ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా వినియోగించే డబ్బాలను , టిఫిన్ బాక్స్ లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ, డిఇఓ, ఎంపీడీవో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాను నిరోధించాలి

### రాజోలి మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

రాజోలి జూన్ 16 (విజన్ ఆంధ్ర బ్యూరో): ఇసుక అక్రమ రవాణాను నిరోధించాలని, ఇసుకను బుక్ చేసుకునే వినియోగదారులకు నిబంధనల ప్రకారం సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ రాజోలి మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా సమీపంలోని తుమ్మిళ్ల ఇసుక ర్యాంపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడానికి పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక ర్యాంపు వద్ద సమగ్ర కార్యకలాపాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిసి కెమెరాల నిరంతర పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. మైనింగ్, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అక్కడి రిజిస్టర్ లను పరిశీలించి తగు సూచనలు చేశారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ రాజోలిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించారు. అక్కడి సిబ్బంది హాజరు రిజిస్టర్ ను పరిశీలించి రంజిత్ కుమార్, కిష్టమ్మ అనే ఉద్యోగులు చాలా రోజులుగా హాజరు నమోదు చేయకపోవడాన్ని తీవ్రంగా పరిగణించి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాల్సిందిగా వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. పిహెచ్ సి లో రోగుల సంఖ్య చాలా తక్కువగా ఉందని, ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా వైద్య సిబ్బంది పనితీరును మెరుగుపరచుకోవాలన్నారు. వివిధ రిజిస్టర్ లను సమగ్రంగా పరిశీలించి అప్డేషన్ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో వివిధ విభాగాలను పరిశీలించి నెల రోజుల్లో సిబ్బంది తమ పనితీరును మెరుగుపరచుకోకుంటే తగు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. అనంతరం రాజోలి తహసిల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియకు కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసిందని, దాని ప్రకారం సంబంధిత అధికారులు ముందుకెళ్లాలన్నారు. బిఎల్ఓ లకు సమగ్రంగా ఎస్ఐఆర్ ప్రక్రియపై శిక్షణ ఇచ్చి, ఈనెల 26 నుంచి వారి పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఇంటింటికి తిరిగి ఓటర్లకు ఎనిమరేషన్ ఫారాలను అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా భూభారతి, సాదాబైనామా, తదితర దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ తహసిల్దార్ కు



సూచించారు. మార్కెడ్ ఆధ్వర్యంలో సమీపంలో ఏర్పాటుచేసిన జొన్న కొనుగోలు కేంద్రంను సందర్శించి అక్కడి రైతులు, అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. రాజోలి కస్తూర్బా విద్యాలయంను కూడా సందర్శించిన జిల్లా కలెక్టర్ అక్కడ స్టాఫ్ హాజరు పరిశీలించి, సిబ్బంది వివరాలను అడిగారు. విద్యా సంస్థలు పున ప్రారంభమై రెండు రోజులవుతున్న విద్యార్థులు రాకపోవడమేమిటని ప్రశ్నించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి విద్యార్థులు విద్యాలయంకు వచ్చేలా చొరవ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అనంతరం కలెక్టర్ అక్కడి పలు విభాగాలను పరిశీలించి అడ్మిషన్స్ కోసం వచ్చే విద్యార్థుల కోసం వంట చేయకపోవడాన్ని గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాలయంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించి, అదనపు తరగతి గదుల నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా, ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. అనంతరం రాజోలి గ్రామ సర్పంచ్ గంగిరెడ్డి, ఉప సర్పంచ్ సంధ్యారెడ్డి పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ పర్యటనలో తహసిల్దార్ రామ్మోహన్, ఎంపీడీవో సయ్యద్ ఖాన్, మార్కెడ్ డిఎం చంద్రమౌళి, ఎస్సై గోకారి, తదితరులున్నారు.

## సఖి సెంటర్లో అందిస్తున్న సేవల నాణ్యతను మెరుగుపరచాలి

### జిల్లా సంక్షేమ శాఖ అధికారి నిషిత

గద్వాల జూన్ 16 (విజన్ ఆంధ్ర బ్యూరో): జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని సఖి సెంటర్లో మహిళలు, బాలికలకు అందిస్తున్న సేవల నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు జిల్లా సంక్షేమ అధికారి నిషిత తెలిపారు. గత వారం జిల్లా కలెక్టర్ తనిఖీలో గుర్తించిన లోపాలను సవరించేందుకు తక్షణ చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా సంక్షేమ శాఖ అధికారిని నుషిత ఒక ప్రకటనలో తెలిపారు. సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం, రికార్డుల నిర్వహణ మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది విధి నిర్వహణను సమీక్షించినట్లు, ఇతర అంశాలకు సంబంధించిన లోపాలు గుర్తించబడగా, బాధ్యులైన సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరిగిందని, అలాగే విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు చేపట్టడంతో పాటు భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేయడానికి అదనపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సఖి కేంద్రం ద్వారా మహిళలు, బాలికలకు 24 గంటల అత్యవసర సేవలు, తాత్కాలిక ఆశ్రయం, వైద్య సేవలు, మానసిక పరామర్శ, న్యాయ సహాయం, పోలీసు సహకారం, పునరావాస సేవలు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిరంతరం అందించబడుతున్నాయని తెలిపారు. అవసరమైన మహిళలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇటువంటి నిర్లక్ష్యం పునరావృతం కాకుండా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయడంతో పాటు బాధిత మహిళలకు సమర్థవంతమైన సేవలు అందించేందుకు అన్ని చర్యలు చేపట్టామని జిల్లా సంక్షేమ అధికారి నుషిత వెల్లడించారు.

## దీన్ దయాళ్ నగర్ రోడ్ సమస్యను పరిష్కరించాలి : క్యానం రాజ్యలక్ష్మి

మల్కాజిగిరి, జూన్ 16(విజన్ ఆంధ్ర): వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని దీన్ దయాళ్ నగర్ లో రోడ్ సమస్యను పరిష్కరించాలని మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి కోరారు. సోమవారం ఆమె, ప్రజా వాణి కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... దీన్ దయాళ్ నగర్ రోడ్ అభివృద్ధి పనులకు నిధులు కేటాయిం చినా, నేటి వరకూ పనులు ఈ ప్రారంభం కాలేదని దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారని ఆమె చెప్పారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా త్వరగా ఈ రోడ్డు పనులు ప్రారంభించాలని ఆమె కోరారు. అలాగే, గౌరీశంకర్ అపార్ట్మెంట్స్ నుండి దీన్ దయాళ్ రోడ్ వరకు ఉన్న ఫుట్ పాత్ తొలగింపు సమస్యను పరిష్కరించాలని జోనల్ కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ ఫుట్‌పాత్ కారణంగా రోడ్డు ఇరుకుగా మారి వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తరచూ ప్రమాదాలు జరుగు తున్నా యని ఆమె వివరించారు. తను విన్నవించిన సమస్య లపై జోనల్ కమిషనర్



సంచిత్ గంగ్వార్ సానుకూ లంగా స్పందించారని, తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని క్యానం రాజ్యలక్ష్మి చెప్పారు.

## తాగునీటి సరఫరాపై పూర్తిస్థాయిలో పరిశీలన

గద్వాల జూన్ 16 (విజన్ ఆంధ్ర బ్యూరో): జల్లాపూర్ గ్రామంలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో కుళ్లిపోయిన విషపూరిత పాములు, వాటి ఎముకలు ఉన్నాయనే అంశంపై సోషల్ మీడియా, వివిధ దినపత్రికలలో జోగులాంబ గద్వాల జిల్లా ఎడిషన్‌లో ఈనెల 13న ప్రచురితమైన వార్తను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మిషన్ భగీరథ అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించినట్లు కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులు, అసిస్టెంట్ ఇంజనీర్, మైక్రోబయాలజిస్ట్, ఎంపీఓ, గ్రామ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ సమక్షంలో జల్లాపూర్ గ్రామంలోని ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్లు, ఇంట్రా పైప్‌లైన్లు, తాగునీటి సరఫరా వ్యవస్థను పూర్తిస్థాయిలో తనిఖీ చేయడంతో పాటు తాగునీటి నమూనాలను సేకరించి ప్రయోగశాలలో నాణ్యత పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షించిన నీటి నమూనాల నివేదికల ప్రకారం తాగునీటిలో ఎటువంటి కలుషిత లక్షణాలు, విషపూరిత పదార్థాలు లేదా హానికర అవశేషాలు లేవని స్పష్టంగా నిర్ధారణ అయినట్లు పేర్కొన్నారు. తాగునీటి నాణ్యత నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు ప్రయోగశాల పరీక్షల ద్వారా ధృవీకరించబడిందని పేర్కొన్నారు . కాబట్టి జల్లాపూర్ గ్రామ మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో కుళ్లిపోయిన పాములు లేదా వాటి ఎముకలు ఉన్నాయనే వార్త పూర్తిగా అవాస్తవమని, ప్రజలు ఇటువంటి పుకార్లు, నిరాధార వార్తలను విశ్వసించవద్దని కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి సూచించారు. తాగునీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన తాగునీటిని అందిస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

# దాతల ఔదార్యం.. ప్రభుత్వ బడులకు భరోసా...

ప్రభుత్వ నిర్లక్ష్యం..
దాతల చొరవతో బడులకు కళ
ఆరుగురు విద్యా వాలంటీర్ల నియామకానికి ముందుకొచ్చిన బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు..
వాలంటీర్ల వేతనాలు భరించనున్న మాజీ కార్పొరేటర్లు
కిచెన్ షెడ్ల నిర్మాణం, మరమ్మతుల పనులకు స్వచ్ఛందంగా బాధ్యతలు
రాజకీయాలకు అతీతంగా విద్యాభివృద్ధి కోసం కృషి చేయాలి
విద్యార్థుల కోసం చేయూతనిచ్చిన దాతలను అభినందించిన మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి





బోడుప్పల్/మేడ్చల్ జిల్లా,జూన్ 16 (విజన్ ఆంధ్ర ప్రతినిధి):ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి బాధ్యత పూర్తిగా ప్రభుత్వానిదే. విద్యార్థులకు నాణ్యమైన విద్య, సరిపడా ఉపాధ్యాయులు, మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధ బాధ్యత. అయితే పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికీ ఉపాధ్యాయుల కొరత, మౌలిక సదుపాయాల లేమి కొనసాగుతుండటం ఆందోళన కలిగించే అంశంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ సర్కిల్ బోడుప్పల్ పరిధిలోని పీర్జాదిగూడ, మేడిపల్లి, పర్వతాపూర్ ప్రభుత్వ పాఠశాలలకు మాజీ కార్పొరేటర్లు హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, బీఆర్ఎస్ నాయకులు ఆకుల మధుకర్, యాసారం శ్రీనివాస్, మునికుంట్ల కిరణ్ గౌడ్ లు అండగా నిలవడం చర్చనీయాంశమైంది. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ అవసరమైన బోధనా సిబ్బంది లేకపోవడంతో విద్యార్థుల చదువులు ప్రభావితమవుతున్నాయని ప్రధానోపాధ్యాయులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ స్థాయిలో సమస్య పరిష్కారం కావాల్సి ఉండగా, స్థానికంగా మాజీ ప్రజాప్రతినిధులు ముందుకొచ్చి ఆరుగురు విద్యా వాలంటీర్ల నియామకానికి సిద్ధపడటం విశేషం. వారి వేతనాలను కూడా స్వయంగా భరించేందుకు ముందుకు రావడం ప్రభుత్వ వ్యవస్థలో ఉన్న లోపాలను పరోక్షంగా ఎత్తిచూపుతున్నట్లు కనిపిస్తోంది.

ప్రభుత్వ నిర్లక్ష్యం.. దాతల చొరవ

ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ షెడ్ల వంటి కనీస మౌలిక వసతులు కూడా లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. విద్యార్థుల కోసం ప్రభుత్వం చేయాల్సిన పనులను స్థానిక దాతలు, మాజీ కార్పొరేటర్లు చేపట్టాల్సి రావడం విద్యారంగ దుస్థితిని చాటుతోంది. కిచెన్ షెడ్ల నిర్మాణం, మరమ్మతులకు దాతలు ముందుకు రావడాన్ని ప్రజలు అభినందిస్తూనే, ప్రభుత్వమే తన బాధ్యతలను విస్మరిస్తోందని విమర్శిస్తున్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఔదార్యంపై ప్రజల హర్షం...

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం విద్యా వాలంటీర్ల నియామకం, కిచెన్ షెడ్ల నిర్మాణం, మరమ్మతుల బాధ్యతలను స్వచ్ఛందంగా స్వీకరించిన మాజీ కార్పొరేటర్లు హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, బీఆర్ఎస్ నాయకులు ఆకుల మధుకర్, యాసారం శ్రీనివాస్, మునికుంట్ల కిరణ్ గౌడ్ ల సేవాభావాన్ని స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ముందుకొచ్చిన దాతల ఔదార్యం ఆదర్శప్రాయమని తల్లిదండ్రులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాజకీయాలకు అతీతంగా విద్యాభివృద్ధి కోసం కృషి చేయాలి: ఫీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే మా లక్ష్యం. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలు ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యనభ్యసిస్తున్నారు. అలాంటి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా విద్యాభివృద్ధి కోసం అందరూ ముందుకు రావాలని కోరుతున్నాను. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారా వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయవచ్చని మేము విశ్వసిస్తున్నాం. రాబోయే రోజుల్లో కూడా పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు, విద్యా సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.



## అధిక ధరలకు విక్రయిస్తే డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తాం

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 16 ( విజన్ ఆంధ్ర ) : ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ధనలక్ష్మి ఫర్టిలైజర్ దుకాణాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి ధరల పట్టిక, నిలువల రిజిస్టర్ ను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు, విత్తనాలను విక్రయించాలన్నారు. ప్రభుత్వం సూచించిన ధరలకు అనుగుణంగా మాత్రమే విక్రయించాలని ఆయన తెలిపారు. డీలర్లు అక్రమాలకు పాల్పడినట్లయితే చట్టరీత్యా తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ను సందర్శించి హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థులు అధిక శాతంలో పాఠశాలకు హాజరయ్యేలా శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ఆదేవిధంగా పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. గత సంవత్సరం ఉత్తీర్ణత శాతం అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ తో పాటు జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం, తహసిల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ వినయ్ కుమార్ లు ఉన్నారు.

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎల్టి ఎస్ టి ఎల్ సి ఉద్యోగాలు కొరకు దరఖాస్తు చేసుకోండి : జిల్లా కలెక్టర్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి జూన్ 16: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం సిద్దిపేట. కాంట్రాక్టు ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని 2 ల్యాబ్ టెక్నీషియన్ ఎల్టి మరియు 1 ఎస్ టి ఎల్ ఎస్ అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరడమైనది. పూర్తిచేసిన అప్లికేషన్లను ఈనెల 17-6-2026 నుండి 19-6-2026 సాయంత్రం ఐదు గంటల లోపల సమీకృత జిల్లా కార్యాల సముదాయం ఐ డి ఓ సి సిద్దిపేటలో గల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అప్ప చేసుకోగలరు విద్యా అర్హతలు. ( ల్యాబ్ టెక్నీషియన్ ) ఇంటర్మీడియట్ తో పాటు డిప్లమా ఇన్ మెడికల్ లాబరేటరీ టెక్నాలజీ లేదా సమానమైన అర్హత గల సర్టిఫికెట్టివ్వా అర్హతలు. ఎస్టి ఎల్ ఎస్ డిగ్రీ తో పాటు డిప్లమా ఇన్ మెడికల్ లాబరేటరి టెక్నాలజి లేదా సమానమైన ప్రభుత్వ ఆమోదం పొందిన సర్టిఫికెట్.

## బస్సుల ఫిట్నెస్‌కు విద్యాసంస్థలు ముందుకు రావాలి
## జిల్లా రవాణా శాఖ అధికారి గోపి కృష్ణ




మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 16,(విజన్ ఆంధ్ర ): పాఠశాలలు, కళాశాలలు ఈ విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే విద్యార్థులను తరలించే బస్సుల ఫిట్నెస్ పై యాజమాన్యాలు ముందుకు రావాలని, కాని విద్యాసంస్థలు ప్రారంభం అయిన ఇంకా ఆయా బస్సుల్లో నిబంధనలను ఉల్లాంఘిస్తున్నారని జిల్లా రవాణా శాఖ అధికారి గోపి కృష్ణ తెలిపారు. ఈ నేల 15,16 న చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో 5 విద్యాసంస్థల బస్సుల్లో కనీసం విద్యార్థుల పట్టిక, ఫైర్ ఎగ్జిస్టర్,ప్రథమ చికిత్స కిట్టు తోపాటు భద్రత ప్రమాణాలు పాటించని వాటిపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. విద్యాసంస్థల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రుల తో కలిసి కమిటీ వేసుకోవాలని, ఆ కమిటీ ప్రతి 15 రోజులకోసారి ఆయా బస్సుల్లో భద్రత ప్రమాణాలపై చర్చించుకోవాలన్నారు. అయినప్పటికీ యాజమాన్యం అదేమీ పట్టనట్లు వ్యవహారిస్తే తాము చేపట్టే తనిఖీల్లో పట్టుబడితే బస్సులను సిజ్ చేస్తామని హెచ్చరించారు. ఇంకా ఫిట్నెస్ చేయించుకోలేని బస్సులుంటే యాజమాన్యం ముందుకు రావాలని అన్నారు. రవాణా శాఖ నిబంధనలు గాల్లో వదిలేసి ఇష్టనుసారంగా విద్యార్థులను తరలిస్తే చర్యలు తప్పవని అన్నారు. ఈ తనిఖీల్లో అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ లు ఉన్నారు.

## పోలీసుల పక్షపాత వైఖరికి నిరసనగా రెండో రోజు విధుల బహిష్కరణ

**అక్రమ కేసు ఉపసంహరించుకునే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని న్యాయవాదుల హెచ్చరిక**




మహబూబ్‌నగర్, అర్బన్ జూన్ 16 (విజన్ఆంధ్ర) :మహబూబ్‌నగర్ బార్ అసోసియేషన్ సభ్యుడు వి. నరేందర్ నాయక్‌పై నమోదైన అక్రమ ఎఫ్ఐఆర్‌కు నిరసనగా ఉమ్మడి జిల్లా న్యాయవాదులు రెండో రోజు కూడా విధులను బహిష్కరించి ఆందోళనలు కొనసాగించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. ఆనంద్‌రావు నేతృత్వంలో న్యాయవాదుల సర్వసభ్య సమావేశం నిర్వహించి అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఆనంద్‌రావు మాట్లాడుతూ, న్యాయవాది వి. నరేందర్ నాయక్ తన మిత్రుని కోసం వెళ్లిన సమయంలో నిందితుడు బద్రు నాయక్ దాడికి పాల్పడ్డాడని తెలిపారు. తాను న్యాయవాదినని, తన మిత్రుని తరఫున వచ్చినట్లు చెప్పినా కూడా అక్కడ సరైన స్పందన లభించలేదని పేర్కొన్నారు. అనంతరం జరిగిన ఘటనపై ఎఫ్ఐఆర్ నంబర్ 325/2026 కింద బద్రు నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అయితే రెండు రోజుల అనంతరం న్యాయవాది రాజీకి రావడం లేదనే కారణంతో, బద్రు నాయక్ భార్య ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు ఆధారంగా రూరల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ నిందితులతో కుమ్మక్కై బాధితుడైన న్యాయవాదిపైనే కౌంటర్ ఎఫ్ఐఆర్ నమోదు చేశారని ఆరోపించారు. క్రైమ్ నంబర్ 330/2026గా నమోదైన ఈ కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

జాతీయ లోక్ అదాలత్ బహిష్కరణ ప్రకటించిన న్యాయవాదులు

పోలీసుల పక్షపాత వైఖరికి నిరసనగా ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను బహిష్కరిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా న్యాయవాదులు ప్రకటించారు. న్యాయవాదిపై నమోదైన తప్పుడు కేసును రద్దు చేసి, ఘటనపై నిష్పక్షపాతంగా వ్యక్తిగత విచారణ జరిపే వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని బార్ అసోసియేషన్ స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ చైర్మన్ వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి డబ్బుల నర్సింహారెడ్డి, సీనియర్ న్యాయవాదులు చంద్రమౌళి, బెక్కం జనార్దన్, అనంతరెడ్డి, అనిల్ కుమార్, గడ్డం గోపాల్, నాగేందర్, మనోహర్, నరేందర్ గౌడ్, టి. కృష్ణ, రాజీవ్ కుమార్, కమిటీ సభ్యులు, మహిళా న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో కామారెడ్డి జిల్లా ప్రథమ స్థానం
## - కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి బ్యూరో జున్ 16(విజన్ఆంధ్ర): రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది సమిష్టి కృషి ఫలితంగా కామారెడ్డి జిల్లా రాష్ట్రవ్యాప్తంగా ప్రథమ స్థానం సాధించిందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి జిల్లాలో విశేష స్పందన లభించిందని, ప్రతి శాఖ అధికారి, ఉద్యోగి అంకితభావంతో పనిచేయడం వల్ల ఈ ఘనత సాధ్యమైందన్నారు. జిల్లాకు వచ్చిన ఈ గుర్తింపు గర్వకారణమని పేర్కొన్నారు. ఇంకా మన జిల్లా అగ్రస్థానాన్ని కొనసాగించేందుకు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సభ్యత్వ నమోదు గడువును జూలై 31 వరకు పొడిగించినందున, పెండింగ్‌లో ఉన్న నమోదులను పూర్తిచేసి జిల్లాను మరింత ముందంజలో నిలపాలని సూచించారు. ఇప్పటివరకు అందించిన సహకారానికి అధికారులు, సిబ్బందికి కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. ఇదే ఉత్సాహం, నిబద్ధతతో కార్యక్రమాన్ని కొనసాగించి కామారెడ్డి జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో ,నిలబెట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఎక్సైజ్ శాఖ సిబ్బంది రక్తదానం అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ లోని 25 వ రూమ్ నెంబర్ లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు ప్రాణదానం చేయడమే నని ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, అవసరమైన సమయంలో రక్త నిల్వలు అందుబాటులో ఉండేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. రక్తదానం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని, ఇది సురక్షితమైన మానవతా దృక్పథంతో కూడిన సేవ అని తెలిపారు. రక్తదాన శిబిరంలో పాల్గొన్న సిబ్బందిని కలెక్టర్ అభినందించి, సమాజంలో రక్తదానం పై మరింత అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ నెట్‌వర్క్ బలోపేతం , వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలు :
## టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

నిర్మల్ జిల్లా,జూన్ 16(విజన్ ఆంధ్ర); 11 కేవీ, 33 కేవీ ఫీడర్లలో ట్రిప్పింగ్‌లను సాధ్యమైనంత వరకు తగ్గించేందుకు ప్రస్తుత విద్యుత్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయాలని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం నిర్మల్ అధికారులతో సీఎండీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో సీఎండీ మాట్లాడుతూ అవసరమైన చోట మధ్యంతర విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో పాటు లైన్‌లలోని లోపాలు సరిదిద్దాలని అన్నారు. నిర్మల్ టౌన్, నిర్మల్ రూరల్ ఉపవిభాగాల సాంకేతిక, వాణిజ్య పనితీరు సూచికలను పరిశీలించి, అవసరమైన చోట పనితీరు మెరుగుదలకు సంబంధిత అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. వినియోగదారులకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంతో పాటు భవిష్యత్తు విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన హెచ్‌టీ, ఎల్‌టీ లైన్ విస్తరణలు , అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల (డీటీఆర్) వైఫల్యాలను తగ్గించేందుకు అవసరమైన చోట మధ్యంతర స్తంభాలు ఏర్పాటు చేయడం, అధిక లోడ్ ఉన్న ప్రాంతాల్లో స్పేసర్లు అమర్చడం, ఓవర్‌లోడ్ అయిన డీటీఆర్‌లను మార్చడం, అలాగే ప్రమాదకర ప్రాంతాల్లోని 11 కేవీ ఫీడర్లపై లైట్నింగ్ అరెస్టర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి, తక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా విద్యుత్ ప్రమాదాలను తగ్గించాలని ఆదేశించారు. విద్యుత్ పనులు నిర్వహించే సమయంలో ఫీల్డ్ సిబ్బంది తప్పనిసరిగా నిర్దేశిత భద్రతా పరికరాలను ఉపయోగించాలని, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించాలని సూచించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను నమోదైన తేదీ నుంచి రెండు నెలల వ్యవధిలోపు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సకాలంలో విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అలాగే, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సాంకేతిక ప్రమాణాల పాటింపు, వాణిజ్య పనితీరు మెరుగుదల, వినియోగదారుల సంతృప్తి పెంపే సంస్థ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నిర్మల్ ఆపరేషన్ సూపరింటెండింగ్ ఇంజనీర్, నిర్మల్ డివిజనల్ ఇంజనీర్ (ఆపరేషన్), నిర్మల్ టౌన్ మరియు నిర్మల్ రూరల్ ఉపవిభాగాల ఆపరేషన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల నమోదు ప్రక్రియ సమర్ధవంతంగా నిర్వహించాలి

**- బిఎల్ఓ,బిఎల్ఏల సమన్వయ సమావేశం....**
**- పలు సూచనలు చేసిన అదనపు కలెక్టర్ శ్రీజ...**



కారేపల్లి,జూన్ 16 (విజన్ ఆంధ్ర ): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా శిక్షణ/సమన్వయ సమావేశాన్ని మంగళవారం వైఎస్ఎన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. తాసిల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ హాజరయ్యారు. సర్పంచులు, బిఎల్వోలు,బిఎల్ఏలతో జరిగిన సమావేశంలో శ్రీజ మాట్లాడుతూ... ఇప్పటివరకు జరిగిన ఓటరు జాబితాలో ఎంతమందిని మ్యాపింగ్ చేశారో తెలపాలని,మ్యాపింగ్ చేయని వారిని ఏబిఏబిసిడిలు వర్గీకరించి వారి పత్రాలను 25వ తారీకు లోపు సేకరించి,తదుపరి ప్రతి ఒక్క ఓటరు ఇంటికి వెళ్లి సర్వే చేసి ఎన్యుమరేషన్ ఫామ్ ను పూర్తి చేయవలసిందిగా ఆదేశించారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు రంజిత్ కుమార్ పలు ప్రశ్నలు లేవనెత్తగా..చనిపోయిన వారి కుటుంబ సభ్యుల వాంగ్మూలను తీసుకొని వారిని ఓటర్ జాబితా నుండి తొలగించడం జరుగుతుందని తెలిపారు. రెండు చోట్ల ఓటు వినియోగంలో ఉన్నప్పుడు తమకు ఏదైనా ఒకే ప్రాంతంలో ఓటు హక్కును వినియోగించుకునే వెసులుబాటు ఉంటుందో బిఎల్ఓ కి సూచించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్లెల రవీంద్ర ప్రసాద్, స్థానిక సర్పంచ్ మేదరి ప్రతాప్ (టోనీ),కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్ష సజావుగా జరిగేలా చూడాలి: మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జూన్ 16 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): జూన్ 21 న జరుగనున్న నీట్ పరీక్ష (నేషనల్ ఎలిజిబిలిటి కమ్ ఎంట్రన్స్ టెస్ట్) ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసి సమావేశంలో ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 12 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ పరీక్షకు జిల్లా నుండి 3 వేల 311 మంది అభ్యర్థులు హాజరవుతున్నారన్నారు. అభ్యర్థులు నిర్ణీత సమయంలోగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అదనపు కలెక్టరు సూచించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్లో ఉన్న నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.

పరీక్షలకు హాజరయ్యే అభర్థులకు కరెంట్, మంచినీరు అందుబాటులో ఉంచాలని, కేంద్రాల వద్ద పోలీసు అధికారులు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వైద్య అధికారులు మెడికల్ కిట్, అంబులెన్సలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. నిరంతరాయ విద్యుత్తు సరఫరా ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగులకు అవసరమైన వీల్ చైర్ వంటి వాటిని అందుబాటులో ఉండేలా డిడబ్ల్యూఓ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు వెంకట్ రెడ్డ, శ్యాంప్రకాష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కార్మికుల కష్టాలు తెలుసుకునేందుకే బాయిబాట యాత్రతో మీ ముందుకు వచ్చాను

## అన్నలు లేరని అనుకుంటున్నారా.. వాళ్ళంత మా పార్టీలోనే ఉన్నారు

## ఎస్ఆర్పి గని సందర్శనలో టిఆర్ఎస్ చీఫ్ కవిత





మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 16,(విజన్ ఆంధ్ర ): సింగరేణిలో బాయిబాట యాత్రలో భాగంగా మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో రెండవ రోజు పర్యటనలో భాగంగా ఎస్ఆర్పి గానిని మంగళవారం తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత సందర్శించారు. కవిత ఎస్ఆర్పి గని లోపలికి వెళ్లేందుకు యత్నించగా అక్కడ సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో లోపలికి అనుమతి లేదంటూ తెలియజేయడంతో కవిత తన అనుచరులతో కలిసి బలవంతంగా లోపలికి వెళ్లారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ అన్నలు లేరనుకుంటున్న సింగరేణి అన్నలందరూ తమ పార్టీలోనే ఉన్నారని తెలియజేశారు. సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తామని అన్నారు. కార్మికుల కష్టాలు తెలుసుకునేందుకే బాయ్ బాట యాత్రతో బయలుదేరానని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులతో మాట్లాడదాం అనుకుంటే అడ్డుకోవడం సరైనది కాదని అదేవిధంగా వ్యవహరిస్తే కోర్టుకు సైతం వెళ్తామని సూచించారు. కార్మికుల హక్కులను కాలరాసే కేంద్రంలోని బిజెపి నాలుగు లేబర్ కోడ్ చట్టాలను తీసుకొచ్చిందని, వాటిని వెంటనే అమలు చేయమంటూ అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం చేయాలని అన్నారు. సింగరేణి సంస్థతో నాకు 20 ఏళ్ల అనుబంధం ఉందని, వారికోసం ఎప్పటికీ పని చేస్తూనే ఉంటానని తెలిపారు. సింగరేణి ఎన్నికల్లో టిఆర్ఎస్ అనుబంధ సంస్థ అయినా హెచ్ ఎం ఎస్ ను గెలిపించాలని ఆమె కోరారు. సింగరేణిలో అండర్ గ్రౌండ్ మైనింగ్ ఉంటేనే ఇక్కడ వారికి ఉద్యోగ, ఉపాధి దొరుకుతుందని కానీ అండర్ గ్రౌండ్ మైనింగ్ తగ్గించి ఓపెన్ కాస్టు మైనింగ్ పెంచాలని చూస్తున్నారని అన్నారు. ఇప్పుడు సింగరేణి ప్రైవేట్ పరం చేసే ప్రయత్నం చేస్తున్నారని రెండు బ్లాక్ లను ఎండిఓ ఇచ్చి ప్రైవేట్ పరం చేశారని ఇప్పుడు దాన్ని మరింత విస్తరించే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. సింగరేణి సంస్థను ప్రైవేటుపరం కాకుండా తాము ఢిల్లీతో రాష్ట్ర ప్రభుత్వంతో కొట్లాడుతామని, కార్మిక చట్టాల గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని వాటిలో మీ రక్షణకు సంబంధించి చాలా అంశాలు ఉంటాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చే నాలుగు లేబర్ కూడా చట్టాలు వస్తే కార్మికులకు హక్కులు లేకుండా పోతాయని, యూనియన్లు ఉండవని, కార్మికులు కష్టాలు వస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికుల సంక్షేమం అభివృద్ధి కోసం తెలంగాణ రక్షణ సేన పనిచేస్తుందన్నారు. కాకుండా తెలంగాణ వ్యాప్తంగా కూడా ప్రజలు అనేక ఇబ్బందుల్లో ఉన్నారని, ముఖ్యంగా ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు కట్టలేని దుస్థితి నెలకొందని, కార్పొరేట్ స్థాయిలో ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాంచ జన్యం పేరుతో ఐదు అంశాలను కీలకంగా పెట్టుకున్నామని అందులో విద్య వైద్యం ఉపాధి సామాజిక న్యాయం కోసం పోరాడతామని పేర్కొన్నారు.సింగరేణిలో కార్మికులతో మాట్లాడే హక్కు ప్రతి ఒక్కరికి ఉందన్నారు.

# హామీలను నెరవేర్చకుంటే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదు

**ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులే**

**గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలి**

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు**

హనుమకొండ జిల్లా ప్రతినిధి జూన్ 16 ( విజన్ ఆంధ్ర ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ప్రభుత్వానికి తిరుగుబాటు తప్పదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. హనుమకొండలోని గుండ్లసింగారం భూపోరాట కేంద్రంలో మంగళవారం సురవరం సుధాకర్ రెడ్డి నగర్ పేరుతో నిర్మించిన సిపిఐ కార్యాలయాన్ని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని, ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు జీవో 58 ప్రకారం పట్టాలు ఇస్తామని చెప్పి నేడు అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది ఇండ్లు లేని నిరుపేదలు ఉన్నారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడిచినా పేదవాడి జీవితం మార లేదని అన్నారు. పేదలు సిపిఐ ఆధ్వర్యంలో అనేక చోట్ల భూపోరాటాలు నిర్వహించి గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని, వారందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాసమస్యలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులేనని అన్నారు. పాలకులు పేదల అనుకూల విధానాలను అవలంబించడం లేదని, ప్రధాని నరేంద్ర మోదీ బంగారం కొన వద్దంటూ పేదలకు నీతులు చెబుతూ పెద్దలకు అనుకూలంగా మెదులుతున్నారని విమర్శించారు. కమ్యూనిస్టుల మద్దతు ఉంటేనే ప్రభుత్వాలు మనగలుగుతాయని అన్నారు. కమ్యూనిస్టులు లేకుంటే తెలంగాణాకే విముక్తి జరిగేది కాదని అన్నారు. గుండ్ల సింగారంలో ఎంతో దీక్ష, పట్టుదలతో కాలనీ నిర్మించుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారని, కాలనీలో నివసిస్తున్న పేదలందరికీ ఇండ్ల పట్టాలు వచ్చేలా తాను అధికారులతో, స్థానిక ఎమ్మెల్యేతో అవసరం అయితే సీఎంతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు.



సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గుడిసెవాసులకు సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, కాలనీలో కరెంట్, తాగునీరు, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, వలీ ఉల్లాఖాద్రి, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, జిల్లా నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, బత్తిని సదానందం, మునిగాల బిక్షపతి, మాలోత్ శంకర్, శనిగరపు రాజు కుమార్, కొట్టె వెంకటేష్, వేల్పుల సారంగపాణి, అనుకారి అశోక్, రాసమల్ల దినా, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, గ్రామ పెద్దలు మాదాసి కళ్యాణ్, గాదె రాజన్న, కట్కూరి కృష్ణ, జన్ను కృష్ణ, నాయకులు పోనుగోటి రాము గోపాల్ చారి, పూజారి అమృతయ్య, కట్కూరి కృష్ణ, కొడెపాక బాబు, మామునూరి దామోదర్, గుడికందుల శివ, పూజారి నరేందర్, కేతపాక ప్రసాద్, తాటికొండ ప్రశాంత్, మాలోత్ మంగ, బైసా మౌనిక, నలువాల సంధ్య, తాటికంటి మమత, గుంటి రజిత, వందలాది ఇండ్ల వాసులు తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్య మండలి నాయకులు గడ్డం రాజనర్సు, రోంటాల శ్యామ్, కేతపాక ప్రసాద్, తాటికంటి మమత, ప్రముఖ సినీ గాయకుడు ఇమ్మడి అశోక్ పాటలు, మహిళల కోలాట నృత్యం ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

# పర్యాటక అభివృద్ధికి అనుకూల ప్రాంతాలు గుర్తించాలి

## - జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 16 (విజన్ఆంధ్ర) : జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అనుకూలమైన ప్రాంతాలను గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులకు సూచించారు. మంగళవారం అనంతగిరి పర్యావరణ పర్యాటక కేంద్ర ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పనులను పరిశీలించారు. జిల్లాలోని అనంతగిరి ప్రాంతంతో పాటు సర్పన్ పల్లి, కోట్ పల్లి ప్రాజెక్ట్ పర్యాటక అభివృద్ధికి పరిశీలించాలని ఆయన తెలిపారు. జిల్లాలోని ఆధ్యాత్మిక ప్రదేశాలను గుర్తించి పర్యాటక అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మున్సిపాలిటీలలో అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ లను సమర్పించాలని కలెక్టర్ సూచించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) సచిన్ బస్వరాజ్ గుట్టూరు, టూరిజం, అటవీ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

# చింత చెట్టును తొలగించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి

- వికారాబాద్ మండలం పులుమద్ది గ్రామంలోని భూమి సర్వే నంబర్ 103
- సివిల్ కోర్టు కేసు నంబర్ 112 ఆఫ్ 2018
- కోర్టు కేసులో కొనసాగుతున్న భూమిలోని చింతచెట్టును తొలగించడం చట్ట విరుద్ధం
- పులుమద్ది గ్రామ నివాసి సయ్యద్ జాఫర్ కుమారుడు సయ్యద్ సుల్తాన్ కలెక్టర్ కు ఫిర్యాదు



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 16 ( విజన్ ఆంధ్ర ) : వికారాబాద్ మండలం పులుమద్ది గ్రామంలోని భూమి సర్వే నంబర్ 108 సివిల్ కోర్టు కేసు ( ఐ.ఎ.నం.486 ఆఫ్ 2018, ఓ.ఎస్.నంబర్ 112 ఆఫ్ 2018 ) లో కొనసాగుతున్నదని పులుమద్ది గ్రామ నివాసి సయ్యద్ జాఫర్ కుమారుడు సయ్యద్ సుల్తాన్ తెలిపారు. ఆ భూమిలో గత 50 సంవత్సరాల క్రితం నుండి ఒక చింత చెట్టు ఆదాయ వనరులను సమకూర్చుతున్నదని ఆయన అన్నారు. మంగళవారం పులుమద్ది గ్రామ నివాసి సయ్యద్ జాఫర్ కుమారుడు సయ్యద్ సుల్తాన్ మీడియాతో మాట్లాడారు. మా తాతల కాలం నుండి ఉన్న ఆ చింత చెట్టు నుండి చింతచిగురు చింతకాయ చింత గింజలు విక్రయించగా వచ్చే డబ్బులు మా కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచేదని ఆయన గుర్తు చేశారు. ఆదాయ వనరులను సమకూర్చే చింత చెట్టును దౌర్జన్యంగా అక్రమంగా చట్టాన్ని ఉల్లంఘించి జెసిబితో కూకటివేళ్ళతో సహా పూర్తిగా పెకిలించి తొలగించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పూత కాయ కాచే చింత చెట్టును తొలగించిన విషయాన్ని 2026 జూన్ 2 మంగళవారం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కు ఫిర్యాదు చేశామన్నారు. 2026 జూన్ 3 బుధవారం వికారాబాద్ మండల రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేశామని ఆయన పేర్కొన్నారు. 2026 జూన్ 8 సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశామని ఆయన వివరించారు. ఇప్పటివరకు అటవీశాఖ అధికారులు సివిల్ కోర్టు కేసులో కొనసాగుతున్న భూమిలో ఉన్న చింత చెట్టును తొలగించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోకపోవడం విచారకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# వరి ధాన్యం కొనుగోలులో జిల్లా ముందంజ

## వంద శాతం కొనుగోలు ప్రక్రియ పూర్తి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల జూన్ 16 (విజన్ ఆంధ్ర బ్యూరో): జోగులాంబ గద్వాల జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించినట్లు, వంద శాతం కొనుగోలుతో రాష్ట్రంలోనే ముందంజలో ఉన్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనతో పాటు అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికార యంత్రాంగం ఆయా కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించడంతో రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేశామన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో మొత్తం 76 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా కొనుగోలు కేంద్రాలకు మొత్తం రూ.121.18 కోట్ల విలువైన 50,725 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చిందని చెప్పారు. రైతులకు ఇప్పటికే ఈ డబ్బులను చెల్లించడం జరిగిందన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్ లు, తేమ కొలిచే మీటర్స్, ఎలక్ట్రానిక్ తూకాలు, ప్యాడి క్లీనర్స్, తదితర కొరత లేకుండా అవసరమైన సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. తరగు, తాలు పేరిట ఎక్కడైనా మిల్లర్లు, ట్రేడర్లు రైతులకు నష్టం చేకూరేలా వ్యవహరించకుండా తగు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యమును కూడా కొనుగోలు చేశామని, రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా కొనుగోలు విషయంలో ఇబ్బందులు ఎదురైనప్పుడు వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసి విషయాన్ని తెలుసుకుని, ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేశామన్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వంద శాతం పూర్తి చేసేందుకు కృషి చేసిన సంబంధిత అధికార యంత్రాంగానికి, సహకరించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

# బీజేపీ మత రాజకీయాలు చేస్తుంది

## -టీ పి సి సి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



సంగారెడ్డి బ్యూరో, జూన్ :16(విజన్ ఆంధ్ర ): బీజేపీకి అనుకూలంగా ఎన్నికల కమిషన్ పనిచేస్తోందని టీ పి సి సి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం నాడు సంగారెడ్డిలో నిర్వహించిన సర్ పై బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. సర్ ప్రక్రియ పారదర్శకంగా కాకుండా ఓట్ల తొలగింపుకు ఉపయోగపడుతోందని ఆరోపించారు. సమావేశంలో మంత్రి దామోదర్ రాజనరసింహ , జగ్గారెడ్డి , టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ నెల 23న ఆందోల్‌లో మీనాక్షి నటరాజన్ తో కలిసి మరో సమావేశం నిర్వహిస్తామని మహేష్ గౌడ్ తెలిపారు. బీజేపీ మత రాజకీయాలు చేస్తోందని, దేవుళ్ల పేరుతో ఓట్లు అడుగుతోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు 80 వేల ఉద్యోగాలు ఇచ్చిందని, ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. గతబి ఆర్ యస్ ప్రభుత్వంపై కూడా విమర్శలు చేస్తూ, 10 ఏళ్లలో ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. కేంద్ర మంత్రి జి . కిషన్ రెడ్డి తెలంగాణకు కేంద్రం ఇంకా రావాల్సిన నిధులు, విభజన హామీలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అభివృద్ధిని చూసి బీజేపీ, బి ఆర్ యస్ ఓర్వలేకపోతున్నాయని వ్యాఖ్యానించారు.

# ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో రాజకీయ పార్టీలు అందరూ భాగస్వామ్యం కావాలి

## జిల్లా కలెక్టర్ హైమావతి పిలుపు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి16 జూన్ : సిద్దిపేట జిల్లా ప్రభుత్వ కాలేజీలో ఏర్పాటుచేసిన ఎస్ ఐ ఆర్ కొరకు అన్ని పార్టీలు పాల్గొనవచ్చని జిల్లాకలెక్టర్పిలుపునిచ్చారు ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి భారతీయ పౌరులను ఓటరుగా జాబితాలో నమోదు కావడం కోసం ఎస్ ఆర్ ఐ ప్రత్యేక సమగ్ర పునఃపరిశీలన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి కే. హైమావతి తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర పునఃపరిశీలన (ఎస్ఐఆర్ 2026) కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మంగళవారం 2కే రన్‌ను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి జెండా ఊపి ప్రారంభించారు. ఈ 2కే రన్‌లో విద్యార్థులు, క్రీడాకారులు, జిల్లా అధికారులు, ప్రభుత్వ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రజలుఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుండి ప్రారంభమైన ర్యాలీ కాంచిచెట్టు సర్కిల్ వరకు సాగి, అక్కడి నుండి తిరిగి కళాశాల ప్రాంగణానికి చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితాల ప్రత్యేకసమగ్రపునఃపరిశీలన (ఎస్ఐఆర్ 2026) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చాలా సంవత్సరాల తర్వాత ఈ సమగ్ర పునఃపరిశీలన చేపడుతున్నందున ప్రతి పౌరుడు ఈ ప్రక్రియలో భాగస్వామి కావాలని కోరారు. ఓటరు జాబితాలను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు ఓటరు నమోదు అధికారులు ఇంటింటికీ వెళ్లి పరిశీలనలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి అర్హత కలిగిన పౌరునికి ఒకే ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇంటింటి సర్వే సందర్భంగా వచ్చే ఓటరు నమోదు అధికారులు, బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు)కి ప్రజలు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఎన్నికల సంఘం సూచనల మేరకు రాజకీయ పార్టీలకు ప్రతి బూత్‌కు ఒక బూత్ లెవల్ ఏజెంట్ (బీఎల్ఏ)ను



నియమించుకునే అవకాశం కల్పించబడిందని తెలిపారు. బీఎల్ఏలు కూడా బీఎల్ఓలతో కలిసి పరిశీలన కార్యక్రమాల్లో పాల్గొంటారని వివరించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హత కలిగిన యువతి, యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అదే విధంగా మరణించిన వారి పేర్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిన వారి పేర్లను ఓటరు జాబితా నుండి తొలగించడం జరుగుతుందని చెప్పారు. కొత్తగా నివాసం ఏర్పరుచుకున్న వారు, ఓటు హక్కు వయస్సు వచ్చిన వారు,ఇప్పటివరకు ఓటరుగా నమోదు కానిఅర్హులందరినీ జాబితాలో చేర్చే చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని జూన్ 27వ తేదీ నుండి జూలై 24వ తేదీవరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కాలంలో ప్రజలు తమ ఓటరు వివరాలనుపరిశీలించుకుని అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చునిసూచించారు. అనంతరం సైక్లింగ్ పోటీలలో జాతీయస్థాయి ప్రతిపక్కన పరిచిన క్రీడాకారులను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగాఅభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్, ఆర్డీవో సిద్దిపేట సదానందం, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రభుత్వ సిబ్బంది, విద్యార్థులు, క్రీడాకారులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రమ బాలుర పాఠశాల రాయిని గూడెంను ఆకస్మికంగా తనిఖీ చేసిన పీఓ ఐటీడీఏ

**-తరగతి గదులు, పరిసరాలు పరిశీలించి అధికారులకు పలు సూచనలు.**

**-బడిబాటలో 100 నూతన అడ్మిషన్లు వస్తాయన్న హెచ్ఎం**



ములుగు జూన్ 16,(విజన్ ఆంధ్ర ప్రతినిధి): ములుగు మండల ఆశ్రమ బాలుర పాఠశాల రాయినిగూడెం ను గురువారం పీఓ ఐటీడీఏ ఏటూరునాగారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులను, మరుగుదొడ్లను, వంటశాలను, విద్యార్థుల వసతి గదులను, పాఠశాల పరిసరాలను పీఓ ప్రత్యక్షంగా పరిశీలించారు. తనిఖీ అనంతరం పాఠశాల సిబ్బందితో సమీక్ష నిర్వహించిన పీఓ, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. బడిబాటపై ఆరా: బడిబాట కార్యక్రమం ద్వారా ఈ ఏడాది ఎంత మంది పిల్లలు నూతనంగా అడ్మిషన్లు పొందుతారని పీఓ ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. ఈ విద్యా సంవత్సరంలో సుమారుగా వంద మంది వరకు నూతన అడ్మిషన్లు జరిగే అవకాశం ఉందని ప్రధానోపాధ్యాయుడు పీఓకు వివరించారు. నూతన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని పీఓ సూచించారు.

# భార్యతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వెళ్లిన భర్త అదృశ్యం



మల్కాజిగిరి, జూన్ 16,(విజన్ ఆంధ్ర): భార్యతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. నేరేడ్మెట్ పోలీసు వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భగత్ సింగ్‌నగర్ కు చెందిన రాసు మహేష్ (45) ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల 13వ తేది తన భార్యతో ఇంట్లో గొడవపడ్డాడు. దీంతో మనస్థాపం చెంది అదే రోజు ఉదయం 9:30 గంటలకు ఎవ్వరికీ చెప్పకుండా తన ఇంటి నుండి బయటకు వెళ్లిపోయి తిరిగి రాలేదు. దీంతో భార్య భాగ్యలక్ష్మి తన భర్త మరలా తిరిగి వస్తాడని రెండు రోజులు ఎదురు చూసింది. ఎంతకీ తన భర్త ఇంటికి తిరిగి రాకపోవడంతో మంగళవారం ఆమె నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. నేరేడ్మెట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ధర్మాజీపేట విద్యార్థులకు నోటు బుక్కులు, పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం....

దుబ్బాక (విజన్ ఆంధ్రా రిపోర్టర్ ): దుబ్బాక మున్సిపాలిటీ ధర్మాజీపేట వార్డులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ధర్మాజీపేటలో మంగళవారం విద్యార్థులకు నోటుబుక్కులు మరియు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ధర్మాజీపేట కౌన్సిలర్లు శ్రీ వనం రమేష్ , శ్రీ మెరుపుల సాయి కుమార్ , శ్రీమతి గోవిందు శోభారాణి విష్ణువర్ధన్ రెడ్డి శ్రీమతి మమత అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకొని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ బి. రవీందర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలు, విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు, విద్యా ప్రమాణాల పెంపు కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మహమ్మద్ సాదత్ అలీ, పల్లె శ్రీనివాస్ గౌడ్ , కె. వెంకట కృష్ణమాచారి, ఆర్ శ్రీనివాస్ రెడ్డి, కె .శ్రీకాంత్, పి. బాలకృష్ణ, వి శైలజ , ఎం.అశోక్, ఎస్. దినేష్, సిహెచ్. చంద్రశేఖర్ , ఎండి వహీద్, సి ఆర్ పి టి.నవీన్ కుమార్ పాల్గొన్నారు.

# మొదటి రోజు టెట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహణ జిల్లా కలెక్టర్ అంకిత్

కొత్తగూడెం బ్యూరో జూన్ 17(విజన్ ఆంధ్ర): జిల్లాలో మంగళవారం నిర్వహించిన టీజీ టెట్ జూన్ 2026 తొలి రోజు పరీక్షలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా యంత్రాంగం ముందస్తుగా చేపట్టిన సమగ్ర ఏర్పాట్లతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పరీక్షలు సజావుగా జరిగాయని పేర్కొన్నారు. జిల్లాలోని అను బోస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరీక్షా కేంద్రంలో రెండు సెషన్లలో పరీక్షలను నిర్వహించారు. ఉదయం నిర్వహించిన తొలి సెషన్ (F/N)లో మొత్తం 145 మంది అభ్యర్థులకు అవకాశం కల్పించగా, వారిలో 127 మంది పరీక్షకు హాజరయ్యారు. 18 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్ష నిర్ణీత సమయానికి ప్రారంభమై ప్రశాంతంగా కొనసాగిందన్నారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన రెండవ సెషన్ (A/N)లో కూడా 145 మంది అభ్యర్థులు కేటాయించగా, 123 మంది పరీక్షకు హాజరయ్యారు. 22 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఈ సెషన్ కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా ముగిసిందన్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. భద్రతా చర్యలు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలను పరీక్షా కేంద్రంలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం నిరంతర పర్యవేక్షణలో టెట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ అంకిత్ వెల్లడించారు.

# ముస్సిపల్ వార్డులు, గ్రామ సభలు నిర్వహించి ఓటర్ లిస్టును పూర్తి చేయాలి



బాన్సువాడ జూన్ 16 (విజన్ ఆంధ్ర). ముస్సిపల్ వార్డులు గ్రామసభలు నిర్వహించి ఓటర్ లిస్టన లిస్టును పూర్తి చేయాలని మంగళవారం సిపిఐ నియోజకవర్గ ఇన్చార్జి ప్రభుత్వం డిమాండ్ చేశారు. బాన్సువాడ పట్టణం లో ని సిపిఐ కార్యాలయం పక్కన గల నాయి బ్రాహ్మణ ఫంక్షన్ హాల్లో ఎస్ ఐ ఆర్ పై అవగాహన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భం గా సిపిఐ బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జ్ దుబాస్ రాములు మాట్లాడుతూ. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న సార్ సర్వేలో ఓటర్ లిస్టు సంబంధించిన బిఎల్ఎ లు సర్వేకొచ్చిన బి ఎల్ ఓ అధికారి తో సహకరిస్తూ ప్రతి వార్డులలో ఉన్న ఓటర్లను ఎన్రోల్ చేయించాలని దీంతో పాటు ముస్సిపల్ వార్డుల లో అదే విధంగా గ్రామ సభలు నిర్వహించి పట్టణం లోని వార్డులలో, గ్రామం లో ఉన్న ఓటర్ల లిస్టును బహిర్గతపరిచి వలసలు వెళ్లిన వారిని పిలిపించి ఓటర్లుగా నమోదు చేయించాల ని ఆయన కోరారు. ఓట్ మ్యాపింగ్, లో ఓటు కోల్పోకుండా సిపిఐ అనుబంధ కార్మిక సంఘాల నాయకులు సభ్యులు అప్రమత్తం గా ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో సంజీవులు, మంత్రి లక్ష్మణ్, నారాయణ, సాయిలు, లక్ష్మి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ను అభినంధించిన పోలీస్ కమిషనర్



ఖమ్మం జిల్లా బ్యూరో, జూన్ 16 (విజన్ ఆంధ్ర): చిన్నారులపై లైంగిక వేధింపులు పోక్సో కేసుల్లో, గంజాయి వంటి తీవ్రమైన చీఖూా కేసుల్లో బలమైన సాక్ష్యాధారాలు కోర్టుకు సమర్పించడం, ప్రాసిక్యూషన్, పోలీసుల సమన్వయంతో నేరం రుజువు చేయడంలో కీలక పాత్ర పోషిస్తూ... నేరస్థులకు జీవిత ఖైదు, 20 ఏళ్ల జైలు శిక్ష మొదలు అనేక కఠిన కారాగారా శిక్షలు పడేలా కృషి చేసిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జమ్ముల శరత్ కుమార్ రెడ్డి ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఏడాదిలో ఇప్పటికే ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్, రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదు అయిన ఐదు పోక్సో కేసుల్లో ఖమ్మం అర్బన్ కేసు లో నిందుతుడికి జీవిత ఖైదు, రఘునాథపాలెం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష, ఖమ్మం రూరల్ రెండు వేర్వేరు కేసులో ఏడు, ఐదు సంవత్సరాల జైలు,రఘునాథపాలెం కేసులో మూడు సంవత్సరాల ఆరు నెలల శిక్ష పడ్డాయి. అదేవిదంగా గంజాయి వంటి 10 చీఖూా కేసుల్లో ఆరు కేసుల్లో 20 ఏళ్ల కఠిన కారాగారా శిక్ష, మరో రెండు కేసుల్లో 10 ఏళ్ల జైలు, ఒక కేసులో ఏడు ఏళ్ల జైలు, రెండు కేసుల్లో ఏడాది వరకు జైలు శిక్ష పడేలా చేయడంలో కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో పోలీస్ కమిషనర్ అభినందించారు.

# విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసిన సర్పంచ్



బాన్సువాడ జూన్ 16 (విజన్ ఆంధ్ర): జిల్లా పరిషత్ హై స్కూల్ తాడుకోల్ పాఠశాల విద్యార్థులకు మంగళవారం గ్రామ సర్పంచ్ పాఠ్యపుస్తకలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రభుత్వము బడుగు బలహీన వర్గాలు చెందిన నిరుపేద పిల్లల కోసం ప్రభుత్వము నాణ్యమైన విద్యను అందించాలని లక్ష్యం తో పాఠ్యపుస్తకాలు ముందస్తుగానే పంపిణీ చేయడం జరిగిందని ఆయన అన్నారు. పిల్లలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో సర్పంచ్ అందె రమేష్ కుమార్, వార్డు సభ్యులు సతీష్ రెడ్డి, బత్తుల లక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి, పాఠశాల ప్రధానో పాధ్యాయులు, టీచర్స్, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

## వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలతో సమీక్ష సమావేశంలో డీఎంహెచ్‌వో డా. తుకారాం రాథోడ్



కొత్తగూడెం బ్యూరో జూన్ 17(విజన్ ఆంధ్ర): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్ అధ్యక్షతన వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. తుకారాం రాథోడ్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడం ప్రతి వైద్యాధికారి ప్రధాన బాధ్యత అని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజల ఆరోగ్య సూచికలను మెరుగుపరచేందుకు కృషి చేయాలని ఆదేశించారు. సమావేశంలో మాతా-శిశు ఆరోగ్యం, సాధారణ ప్రసవాల ప్రోత్సాహం, వ్యాధుల నివారణ, ఆరోగ్య సేవల నాణ్యత పెంపు అంశాలపై విస్తృతంగా సమీక్ష నిర్వహించారు.

డీఎంహెచ్‌వో సూచనలు:

గర్భిణీలకు నాణ్యమైన గర్భధారణ పూర్వ సేవలు అందించాలి.

అధిక ప్రమాద గర్భిణీలను గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి.

సాధారణ ప్రసవాల శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

మాతృ మరణాలు , శిశు మరణాలు తగ్గించే ప్రణాళికలు అమలు చేయాలి. జననం తర్వాత వెంటనే తల్లిపాలు ఇవ్వడంపై అవగాహన కల్పించాలి.

రక్తహీనత నివారణ, సికిల్ సెల్ అనీమియా స్క్రీనింగ్ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలి. మధుమేహం, రక్తపోటు, ఊబకాయం వంటి జీవనశైలి వ్యాధులపై స్క్రీనింగ్ నిర్వహించాలి. క్షయవ్యాధి, కుష్ఠు, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నివారణ చర్యలు బలోపేతం చేయాలి.

ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించి దోమల నివారణ చర్యలు చేపట్టాలి.

యాంటీ లార్వల్ కార్యక్రమాలు అమలు చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలి. హెచ్ పి వి టీకా, పల్స్ పోలియో, స్టాప్ డయేరియా కార్యక్రమాలను విజయవంతం చేయాలి. సమతుల ఆహారం, వ్యాయామం, యోగా వంటి ఆరోగ్యకర జీవనశైలిని ప్రోత్సహించాలి. ఆరోగ్య కేంద్రాల్లో రికార్డులు, నివేదికలు సక్రమంగా నిర్వహించాలి. ఐ ఈ సి , బి సి సి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంచాలి.

అత్యవసర వైద్య సేవలకు అన్ని ఆరోగ్య కేంద్రాలు సిద్ధంగా ఉంచాలి.

అదేవిధంగా వైద్యాధికారులు తమ పరిధిలోని గ్రామాలను తరచుగా సందర్శించి ఆరోగ్య కార్యక్రమాల అమలును పర్యవేక్షించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సిబ్బంది కొరత ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భర్తీకి సంబంధించి యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. గత జనరల్ ట్రాన్స్ఫర్లలో సబ్ సెంటర్లు పొందని 54 మంది ఏఎన్ఎంలకు కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 18న కొత్తగూడెంలోని డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డా. శ్రీధర్, డా. సాయి కళ్యాణ్, ప్రోగ్రాం అధికారులు డా. ప్రసాద్, డా. ప్రతాప్, డా. రాందాస్, డా. రాకేష్, డా. దినేష్, డా. హరీష్, వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో హాజరు శాతం పెంచాలి

## కుంగిపోయిన కల్వర్టుకు తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలి: జిల్లా కలెక్టర్ అంకిత్





కొత్తగూడెం బ్యూరో జూన్ 17(విజన్ ఆంధ్ర): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదలకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. మంగళవారం ఆళ్ళపల్లి మండలంలో పర్యటించిన కలెక్టర్, మండల ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మొత్తం విద్యార్థుల సంఖ్య, హాజరు శాతం వివరాలను ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ప్రీ-ప్రైమరీ విభాగం, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులకు అందిస్తున్న బోధన విధానం, విద్యా కార్యక్రమాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు తల్లిదండ్రులతో నిరంతరం సంప్రదింపులు జరపాలని, ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలు, నాణ్యమైన విద్యపై విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న భోజనం, పాలు, బాలామృతం తదితర పోషకాహార పదార్థాలను పరిశీలించారు. కేంద్రంలో కేవలం ఇద్దరు పిల్లలు మాత్రమే ఉండటాన్ని గమనించి హాజరు శాతం పెంపునకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పెద్ద వెంకటాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించిన కలెక్టర్, గొత్తికోయలు నివసించే ఈ మారుమూల ప్రాంతంలో బడిఈడు పిల్లలందరూ తప్పనిసరిగా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా పరిశీలించిన కలెక్టర్, పిల్లల సంఖ్య, వారికి అందిస్తున్న సేవలు, పోషకాహార సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అవసరానికి మించి నిల్వలు ఉన్నట్లు గుర్తించి వాటిని సమీప కేంద్రాలకు తరలించాలని సూచించారు. కేంద్రాల్లో పిల్లల చేరికలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిశీలన సందర్భంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, కేంద్ర భవనాలకు పెయింటింగ్ వేయించి పరిశుభ్రంగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా, పోషకాహార సేవలు అందేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో భాగంగా ఆళ్ళపల్లి నుంచి పెద్ద వెంకటాపురం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు కుంగిపోయి ఉండటాన్ని గమనించిన కలెక్టర్ వెంటనే వాహనం దిగి పరిశీలించారు. వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం కలగకుండా అత్యవసరంగా మరమ్మత్తు పనులు చేపట్టాలని ఆర్ అండ్ బీ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేసి రాకపోకలు సాఫీగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, ఆళ్ళపల్లి తాసిల్దారు ఉషారాణి, ఎంఈఓ శాంతారావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలి

## చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసిన కలెక్టర్



నారాయణపేట, జూన్ 16 (విజన్ ఆంధ్ర) : విద్యార్థులు ఇష్టపడి చదివి జీవిత లక్ష్యాన్ని సాధించా లని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ నారాయణపేట మండలం లోని జాజాపూర్ జెడ్పీ ఉన్న త పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూనూతన విద్యా సంవత్సరం ప్రారంభంలో ముందుగా జాజాపూర్ పాఠశాలకు వచ్చానని, ఈ పాఠశాల వచ్చే సంవత్సరం పదో తరగతి లో వందశాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలవాల న్నారు. ఈ జిల్లా నుంచి గతంలో బాసర త్రిపుల్ ఐ టి కి ఎంపిక అయ్యారని ఆమె గుర్తు చేశారు. జాజాపూర్ పాఠశాల నుంచి కూడా త్రిపుల్ ఐ టి కి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. తరగతి గదిలో ఉపాధ్యా యులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని, ఇష్టంతో చదవాలన్నారు. బట్టి పట్టే విధానానికి స్వస్తి పలకా లన్నారు. లెక్కలను సులు వుగా ఎలా చేయాలో విద్యా ర్థులకు ఆమె ప్రాక్టికల్ గా చేసి చూపించారు. విద్యార్థు లకు పదో తరగతే పునాది లాంటిది అన్నారు. రాబోయే పదేళ్ల లో మీరు ఎలా ఉండా లో నోట్ బుక్ లో రాసుకుని, రోజూ దానిని చూస్తూ, అందుకు తగిన ప్రణాళిక ప్రకారం సాధన చేయాలని సలహా ఇచ్చారు. పదో తర గతిలో అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువగా ఉండటం సంతోషంగా ఉందన్నారు. అమ్మాయిలకు ఆర్థిక స్వాతంత్రం కావా లన్నారు. వచ్చే సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో టాపర్ గా నిలిచిన వారికి తన తరపున ప్రత్యేక బహు మతి ఇస్తానని కలెక్టర్ ప్రకటించారు. వచ్చే సంవ త్సరం టాపర్‌ను తప్పని సరిగా తన వద్దకు తీసుకు రావాలని హెచ్ ఎంకు సూచించారు. విద్యార్థులకు పాఠ్య, రాత పుస్తకాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాఠశాల ప్రయోగశాల, గ్రంథాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు.చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించిన కలెక్టర్ : జాజాపూర్ అంగన్ వాడిలో పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకుని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలలో చేరిన (అంగన్ వాడీ) చిన్నారులకు జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక అక్షరా భ్యాసం చేయించారు. అంత కు ముందు సరస్వతీ మాత చిత్రపటానికి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి గోవింద రాజు, మండల విద్యా శాఖ అధి కారి బాలాజీ, ఆయా పాఠశా లల హెచ్ ఎం లు, ఉపాధ్యాయులు, అంగన్ వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కార్యాలయంలో కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

## సిద్దిపేట ఆత్మ కమిటి నిరసన చేసిన కార్మికులకు అన్నదానం చేసిన గోపికృష్ణ



సిద్దిపేట జిల్లా ప్రతినిధి జూన్ 16: నేడు సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కార్యాలయంలో పనిచేస్తున్న కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిద్దిపేట నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ పూజల గోపికృష్ణ గారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ, తమకు ప్రతి నెల సమయానికి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ కి సంభందించిన వాలు జీతాలు సమయానికి ఇవ్వట్లేదు గత 8 నెలల నుండి జీతాలు ఇవ్వట్లేదు అని వాపోయారు. ఆలస్యం కారణంగా కుటుంబాల పోషణకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే జీతాలు కూడా పెంచాలి అని. పి ఫ్ కూడా ఇవ్వాలి అని అన్నారు. కార్మికులు సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ధర్నా విషయం ని తమ దృష్టికి రావటంతో అక్కడికి చేరుకొని కార్మికులతో మాట్లాడిన సిద్దిపేట నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ పూజల గోపికృష్ణ గారు కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ, వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమయానికి జీతాలు అందేలా చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను జిల్లా ఇంచార్జ్ వివేక్ వెంకటస్వామి గారి దృష్టి కి అలాగే నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ గారి దృష్టికి తీసుకెళనాని చెప్పారు. ప్రభుత్వం, అధికారులుసానుకూలంగా పరిశీలించిత్వరితగతినపరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ అజ్మత్. చిన్నకోడూర్ వైస్ చైర్మన్ వంశీ. ఆత్మ కమిటీ డైరెక్టర్ శ్రవణ్. అరవింద్. దస్తగిరి. అశోక్. జనార్ధన్. తదితరులు పాల్గొన్నారు.

# సుభాష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల అడిషనల్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..



కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూన్ 16..కరీంనగర్ నగరంలోని సుభాష్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ అశ్విని తానాజీ వాకడే సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేపట్టిన సన్నద్ధత కార్యక్రమాలను పరిశీలించిన ఆమె, తరగతి గదులు, వంటశాల, మధ్యాహ్న భోజన వంటగది, పాఠశాల ప్రాంగణం, మంచినీటి ట్యాంకులు, ఆట స్థలం తదితర మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తరగతి గదులను సందర్శించిన డాక్టర్ అశ్విని తానాజీ వాకడే విద్యార్థుల అభ్యసన స్థాయిలను పరిశీలిస్తూ రీడింగ్, రైటింగ్, అర్థమెటిక్ నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు చక్కటి చేతిరాత అలవాటు చేయడంతో పాటు వివిధ సబ్జెక్టుల్లో ప్రాథమిక భావనలపై బలోపేతమైన శిక్షణ అందించాలని ఆదేశించారు. సాంఘిక శాస్త్రంలో భాగంగా రాష్ట్రాలు రాజధానులు, ప్రధాన నదులు, భారతదేశం, తెలంగాణ రాష్ట్ర పటాలను విద్యార్థులతో గీయించి వారి అవగాహనను పరిశీలించారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, ఇతర అవసరాలపై వివరాలను తెలియజేయాలని ప్రధానోపాధ్యాయులను ఆమె కోరారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, పాఠ్యపుస్తకాల పంపిణీ, పాఠశాల సన్నద్ధత కార్యక్రమాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, మరిన్ని మెరుగుదలల కోసం పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రశాంత్ రెడ్డి, సమగ్ర శిక్ష జిల్లా కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కొండపాకలో ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య



సిద్దిపేట జిల్లా ప్రతినిధి జూన్ 16: సిద్దిపేట జిల్లా కొండపాక స్థానికుల కథనం ప్రకారం మండలంలోని డబుల్ బెడ్ రూమ్ లో నివాస ముంటున్న మేడిపల్లి రాజు 30 సం వత్సరాలు మంగళవారం ఉదయం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉదయం లేచి చూసేసరికి అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు ఆత్మహత్యకు గల కారణాలు తెలియ రాలేదు. ఆయన మృతి చెందిన కారణాలు పోలీసుల దర్యాప్తు ద్వారా తెలియాల్సింది

# సాఫ్ట్ బేస్ బాల్ సౌత్ ఆసియా కప్‌లో రాణించిన చరణ్‌ను అభినందించిన ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి..



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 16 (విజన్ ఆంధ్ర): కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సౌత్ ఆసియా సాఫ్ట్ బేస్ బాల్ కప్-2026లో అద్భుత ప్రతిభ కనబరిచిన కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన ముప్పిడి చరణ్‌ను ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మారుమూల ఆసిఫాబాద్ జిల్లా నుండి అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లా కీర్తిని దేశవ్యాప్తంగా చాటిన చరణ్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. చరణ్ సాధించిన విజయం జిల్లాలోని యువతకు, క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లాలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు . చరణ్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# 21న నీట్ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

**పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి**
**అభ్యర్థులు ఆభరణాలు ధరించవద్దు**
**విధిగా నిబంధనలు పాటించాలి**
**ఈసారి పరీక్షకు 15 నిమిషాలు అదనం : కలెక్టర్ చిత్రా మిశ్రా**




కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూన్ 16 :ఈనెల 21న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించే నీట్ పరీక్షను భద్రత నడుమ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో విద్య, వైద్య , ఆర్టీసీ, పోలీస్, ఎన్పీడీసీఎల్ శాఖల అధికారులతో నీట్ పరీక్ష నిర్వహణ పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో 3,001 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం రెండు గంటల నుంచి 5:15 గంటల వరకు ఉంటుందని.. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని పేర్కొన్నారు. గతంలో కంటే ఈసారి పరీక్షకు 15 నిమిషాలు ఎక్కువ సమయం ఉంటుందన్నారు. అభ్యర్థులు పాస్ ఫోటో, గుర్తింపు కార్డు, అడ్మిట్ కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. ఆభరణాలు, షూలు ధరించి రావద్దని.. నిబంధనలు విధిగా పాటించాలని అభ్యర్థులకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల నిర్వహణ, అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని అజూాఎశ్రీ అధికారులను.. పరీక్ష కేంద్రం వద్ద మందులతో శిబిరం ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు.

పరీక్షకు రెండు రోజుల ముందే అధికారులు.. పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లు పరిశీలించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు బృందంగా ఏర్పడి పరీక్ష నిర్వహణను విజయవంతం చేయాలన్నారు.

**సెంటర్ కో జిల్లా అధికారి నియామకం :** పరీక్షను పకడ్బందీగా నిర్వహించేలా పరీక్ష కేంద్రానికి అదనంగా ఒక జిల్లా అధికారిని నియమిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అదే రోజున యోగా దినోత్సవం సందర్భంగా ర్యాలీ ఉంటుంది కాబట్టి విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ శాఖ చర్యలు చేపట్టాలన్నారు. ప్రశ్నాపత్రం, సమాధాన పత్రాలు రవాణాకు ప్రత్యేక బందోబస్తు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, పరీక్ష నోడల్ ఆఫీసర్, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ పంకజ్ సింగ్, డీఈఓ ప్రశాంత్, అశోక్ రెడ్డి, ఏసీపీ సతీష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ షాపులలో సీసీఎస్ పోలీసుల తనిఖీలు



భూపాలపల్లి జిల్లా 16 జూన్( విజన్ ఆంధ్ర) ఎస్పీ శ్రీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో గణపురం మండలంలోని ఫర్టిలైజర్ షాపులలో సీసీఎస్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా షాపులలోని స్టాక్ రిజిస్టర్లు, విత్తనాల నిల్వలను పరిశీలించారు. గడువు ముగిసిన విత్తన ప్యాకెట్లు, నకిలీ విత్తనాలు, విడి విత్తనాల విక్రయాలు చేయరాదని, ప్రతి విక్రయానికి తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని షాపు యజమానులకు సూచించారు. వ్యవసాయదారులను మోసగించే విధంగా నిబంధనలకు విరుద్ధంగా విత్తనాల విక్రయాలు నిర్వహించినట్లయితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. వ్యవసాయదారులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, అనుమానాస్పద విత్తనాల విక్రయాలపై సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

## 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విజయవంతంగా పూర్తి...

**జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**
**100 శాతం వరి ధాన్యం కొనుగోలు పూర్తి చేసి రైతులకు రూ.1,238 కోట్ల చెల్లింపులు**
**రానున్న ఖరీఫ్‌లో 2 లక్షల ఎకరాల్లో సన్నబియ్యం సాగుపై అవగాహన కార్యక్రమాలు**
**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం, ధాన్యం కొనుగోలు పై పత్రికా సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్**



జగిత్యాల, జూన్ 16 (విజన్ ఆంధ్ర జిల్లా బ్యూరో): జగిత్యాల జిల్లాలో మార్చి 6 నుంచి జూన్ 12 వరకు నిర్వహించిన 99 రోజుల "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో జిల్లాలో 99 రోజుల కార్యక్రమం ధాన్యము కొనుగోల అంశంపై జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ,లి మార్చి 6న జిల్లాలోని 385 గ్రామాలు, 100కు పైగా మున్సిపల్ వార్డుల్లో గ్రామ, వార్డు సభలు నిర్వహించి 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ప్రారంభంలో పరిశుభ్రత కార్యక్రమాలను మిషన్ మోడ్‌లో చేపట్టి సుమారు 10 వేల పెండింగ్ దరఖాస్తులు, ఫైళ్లను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 6 నుంచి 11 వరకు ఆరోగ్య అవగాహన వారాన్ని నిర్వహించి ఎయిడ్స్, క్షయవ్యాధి, సీజనల్ వ్యాధులు, మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. పోలీసు శాఖ సమన్వయంతో "అరైవ్ అలైవ్" రహదారి భద్రత కార్యక్రమం నిర్వహించినట్లు వెల్లడించారు. సంక్షేమ వారోత్సవాల్లో అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీతో పాటు 1,500 ఇందిరమ్మ ఇళ్ల గృహజ్యోతి ప్రవేశ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఏప్రిల్ 27 నుంచి మే 2 వరకు జిల్లాలోని పాఠశాలల్లో మాదకద్రవ్యాల నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లు 100 శాతం పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జూన్ 10 నాటికి కొనుగోళు పూర్తి చేసి, జూన్ 11 నాటికి రైతులందరికీ చెల్లింపులు పూర్తిచేసినట్లు చెప్పారు. కేవలం 45 రోజుల్లో 85,616 మంది రైతుల నుంచి 5,19,156 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసి రూ.1,238 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో కనీసం 2 లక్షల ఎకరాల్లో సన్నబియ్యం సాగు చేయాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే ఆయిల్ పామ్, పప్పుధాన్యాలు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో కేంద్రియ విద్యాలయానికి భూమి కేటాయించడంతో పాటు ధర్మపురి, జగిత్యాలలో యంగ్ ఇండియా పాఠశాలల కోసం స్థలాలను కేటాయించినట్లు తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను గుర్తించడం పూర్తయ్యిందని, బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో 18 కొత్త ఆర్టీసీ బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. మహిళల భద్రతకు సంబంధించిన పోష్ (POSH) చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు తడి చెత్త పొడి చెత్త వేరు చేసే విధానంపై ప్రజల్లో చైతన్యం కల్పించినట్లు చెప్పారు. జిల్లాకు ఈ ఏడాది 45 లక్షల మొక్కలు నాటే లక్ష్యం నిర్దేశించినట్లు తెలిపారు. వర్షాలు ప్రారంభమైన వెంటనే మొక్కల నాటకం కార్యక్రమాన్ని చేపట్టి, అన్ని శాఖలకు కేటాయించిన లక్ష్యాలను వచ్చే రెండు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. అనంతరం జగిత్యాల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి నేటికి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌ను శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు.

## దామరగిద్ద పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ వినీత్




నారాయణపేట, జూన్ 16 ( విజన్ ఆంధ్ర) : నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మంగళవారం దామరగిద్ద పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతినీ దామ రగిద్ద ఎస్ఐ నరేష్ ను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ప్రజలకు అందుతు న్న సేవలపై ఆరా తీశారు. బాధితులకు ప్రజలకు వేగ వంతమైన పోలీస్ సేవలు అందించాలని ఏవైనా సంఘ టనలపై సమాచారం అందు కున్న వెంటనే బాధితుల ఇళ్లకు వెళ్లి ఫిర్యాదులు స్వీకరించి ఆన్ సైట్ ఎఫ్ ఐ ఆర్ కేసులు నమోదు చేయాలని ఎస్పీ సూచించా రు. అర్ధరాత్రి వేళ గ్రామాలలో రాత్రి వేళల్లో దొంగతనాలు జరుగుకుండా నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని తెలిపారు. వివిధ సమస్యల పై ఫిర్యాదులు చేయడానికి వచ్చిన బాధితులతో సమర స్యంగా మాట్లాడి వారి సమ స్యలు అడిగి తెలుసుకొని సమస్యలపై సిబ్బంది వేగం గా స్పందించాలని ఆదేశించా రు.పోలీసు సిబంది క్రమ శిక్షణ సమయ పాలన పాటించాలని అన్నారు. డయల్ 100 ఫిర్యాదులపై అత్యంత వేగంగా స్పందిం చాలని సూచించారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యక లాపాలు, అక్రమ రవాణాను కఠినంగా నిరోధించాలని ఆదేశించారు. ప్రధాన రహదా రిపై భద్రతను మరింత కట్టు దిట్టం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలు, గంజాయి నిర్మూలనపై ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పించాలని ఎస్పీ పేర్కొన్నారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరిస్తూ వాటి ఏర్పాటుకు ప్రజలను ప్రోత్సహించాలని తెలిపారు. రాత్రి సమయం లో విధుల్లో ఉండే సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ, పరిస్థి తులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రజలకు పూర్తిస్థాయిలో భద్రత, రక్షణ కల్పించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా, ప్రభుత్వ బాధ్యతాయుతంగా వ్యవ హరించి ప్రజలకు చేరువలో ఉంటూ మెరుగైన పోలీసింగ్ అందించాలని తెలిపారు.

## భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి
## మెట్ పెల్లి తహసీల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



మెట్ పల్లి, జూన్ 16 (విజన్ ఆంధ్ర): మంగళవారం రోజున జగిత్యాల జిల్లా మెట్‌పెల్లి మండలం తహసిల్దార్ కార్యాలయంను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్. భూ భారతికి సంబంధించిన పెండింగ్ అంశాలు, ఓటరు జాబితా సవరణ మరియు సాధాబైనామ కు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలపై ప్రతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మరియు మీసేవ సర్టిఫికెట్లను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సర్టిఫికెట్ల ప్రజలకు అందించవలసిందిగా అధికారులకు ఆదేశించారు. ఎస్.ఐ.ఆర్ లో భాగంగా ఇండ్ల గణన విధులు అధికారులు, సిబ్బంది సమన్వయంతో సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లను నియమించడం జరుగుతుందని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా మొదటి విడత ఇండ్ల గణన ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించాలని చెప్పారు. నివేదికలను సమయానికి సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహ రావు, తహసీల్దార్ నీత , రెవెన్యూ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

## హైపో-ఆర్ట్ ద్వారా వృద్ధులు, క్లిష్టమైన క్యాన్సర్ రోగుల చికిత్స



హన్మకొండ జిల్లా ప్రతినిధి జూన్ 16 ( విజన్ ఆంధ్ర ) : హైదరాబాద్ యశోద హాస్పిటల్స్ సరికొత్త విప్లవాత్మక సాంకేతికత అయిన ఎం ఆర్ – లైనకు ద్వారా హైపోఫ్రాక్షనేటెడ్ అడాప్టివ్ రేడియేషన్ థెరపీ హైపో – హార్ట్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. వృద్ధులకు, ఇతర తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న క్లిష్టమైన క్యాన్సర్ రోగులకు చికిత్స అందించడంలో ఈ అత్యాధునిక సాంకేతికతను భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా యశోద హాస్పిటల్స్ ప్రవేశపెట్టిందని యశోద హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ప్రదీప్ కుమార్ కారుమంచి తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ వయస్సు పైబడటం లేదా ఇతర సంక్లిష్ట వైద్య చరిత్రలు ఉన్నప్పటికీ ఇప్పుడు క్యాన్సర్ కు సమర్థవంతంగా చికిత్స చేయవచ్చని పేర్కొన్నారు. గతంలో వృద్ధులలో లేదా ఇతర తీవ్రమైన అనారోగ్యాలు ఉన్నవారిలో ముదిరిన క్యాన్సర్ కణితులకు చికిత్స చేయడం చాలా సవాలుతో కూడుకున్నదిగా ఉండేదని, సాంప్రదాయ దీర్ఘకాలిక రేడియేషన్ విధానాలవల్ల తీవ్రమైన దుష్ప్రభావాలు సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉండేదన్నారు. ప్రస్తుతం క్లినికల్ ప్రాక్టీస్లోకి వచ్చిన ఈ హైపో హార్ట్ విధానం రోగులకు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తుందని, దీని ద్వారా ప్రతి సెషన్లోనూ క్యాన్సర్ కణితిపై తక్కువ రోజుల్లోనే అత్యంత శక్తివంతమైన రేడియేషన్ మోతాదును దోసెస్ అందించవచ్చు అని, దీనివల్ల వృద్ధ రోగులు పదేపదే ఆసుపత్రికి రావాల్సిన అవసరం తగ్గడమే కాకుండా, శారీరక శ్రమ మరియు చికిత్స తాలూకు అలసట కూడా చాలా వరకు తగ్గుతాయని తెలిపారు. ఈ అధునాతన 'హైపో–ఆర్ట్' చికిత్సను సురక్షితంగా అందించడా నికి డాక్టర్ కరుమంచి అత్యంత ఆధునికమైన ఎమ్మార్ లింక్ యంత్రాన్ని ఉపయోగిస్తున్నారని, ఈ సిస్టమ్ హై-ఫీల్డ్ ఎమ్మారై స్కానర్ ద్వార కనుక్కొని చికిత్స అందిస్తారన్నారని తెలిపారు.

## అర్హులైన జర్నలిస్ట్ అందరికీ 2 వ విడత అక్రెడేషన్ కార్డులు
## ఆమోదించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



నాగర్‌కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): జూన్ 15 జిల్లా లో మీడియా అక్రిడేషన్ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు.సోమవారం సాయంత్రం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన రెండో విడత అక్రిడేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ. రెండో విడత జిల్లా స్థాయి మీడియా అక్రిడేషన్ కమిటీ సమావేశంలో అందిన 237 దరఖాస్తులను ఒక్కొక్కటిగా పరిశీలించి, అర్హత ప్రమాణాలను పూర్తి చేసిన జర్నలిస్టులకు మాత్రమే అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని, జిల్లాస్థాయి మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా నిర్ణయించారు.జర్నలిజం వృత్తి సమాజానికి బాధ్యతాయుతమైన సేవ అని, ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించే విలేకరులకు ప్రభుత్వం కల్పిస్తున్న అక్రిడేషన్ సదుపాయాలు నిజమైన జర్నలిస్టులకే అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తుదారుల సేవా వివరాలు, వార్తా ప్రచురణలు, సంస్థల ధృవీకరణ పత్రాలు, పని అనుభవం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎటువంటి ఒత్తిళ్లు, సిఫార్సులు లేదా వ్యక్తిగత అభిప్రాయాలకు తావులేకుండా పూర్తిగా నిష్పాక్షికంగా కమిటీ సభ్యులు వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అక్రిడేషన్ వ్యవస్థపై జర్నలిస్టుల్లోనూ, ప్రజల్లోనూ విశ్వాసం పెరిగేలా ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించాలని చెప్పారు.జిల్లాస్థాయి మీడియా అక్రిడేషన్ కమిటీ సమావేశానికి నాగర్ కర్నూల్ ఆర్టీసీ డిఎం హాజరు కాకపోవడంతో కలెక్టర్ షోకాజ్ నోటీస్ జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు పలు దరఖాస్తులపై తమ అభిప్రాయాలు వెల్లడించగా, అర్హతలు, సమర్పించిన పత్రాలు, స్థానిక స్థాయి ధృవీకరణ నివేదికలను పరిశీలిస్తూ నిర్ణయాలు తీసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కొన్ని దరఖాస్తులపై అదనపు సమాచారం సేకరించి తదుపరి సమావేశంలో తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి జె కిరణ్ కుమార్, జిల్లా స్థాయి మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు విజయ్ కుమార్, చంద్రశేఖర్ రావు, సురేష్ కుమార్, సాయిలు సాగర్, ప్రదీప్ కుమార్, వెంకట్ స్వామి, దస్తగిరి, మొహమ్మద్ ముబీన్ ఖాన్, శ్రీనివాసులు, నేతాజీ గౌడ్ సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## అధికారుల పర్యటనతో జాయింట్ యూజర్ ఎయిర్పోర్ట్ కు మరో ముందడుగు పడింది

### అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్





ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 16, (విజన్ ఆంధ్ర) బెంగళూరు నుంచి ఆదిలాబాద్ వచ్చిన ఎయిర్ ఫోర్స్ అధికారుల పర్యటనతో జాయింట్ యూజర్ ఎయిర్పోర్ట్ కు మరో ముందడుగు పడిందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్పష్టం చేశారు. మంగళవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎంపీ నగేష్ , ఇతర అధికారులతో పాటు బెంగళూరు నుంచి వచ్చిన ఎయిర్ ఫోర్స్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాఅదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్.. మాట్లాడుతూ.. ఎయిర్ ఫోర్స్ అథారిటీకి కావాల్సిన భూమి 15000,360 డిఫెన్స్ సంబంధించింది, 80 ఎకరాలు ఎయిర్పోర్ట్ అథారిటీకి టెర్మినల్ 1849 భూమి పూర్తిగా సేకరించాలని ఒక నిర్ణయానికి వచ్చారు. జాయింట్ యూజర్ ఏర్పోర్ట్ ఒక తుది రూపం వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికి ఇచ్చిన 700 ఎకరాలు భూ సేకరణ జీవో పనులు ప్రారంభించడం జరిగింది. అలాగే మరో 800 ఎకరాలు ప్రభుత్వం నుండి అనుమతులు తీసుకునే విధంగా ప్రయత్నం జరుగుతుందన్నారు. ఇప్పటికే 1500 ఎకరాలు రక్షణ శాఖకు అప్పగించడానికి సిద్ధంగా ఉన్నట్లు దానికి కావాల్సిన మిగతా ఏర్పాట్లు పూర్తి చేయడం చేస్తామన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేక సమర్పించిందన్నారు. జాయింట్ యూజర్ ఎయిర్పోర్ట్ కు అదిలాబాదు లో నిర్మించబోయే ఏర్పాటుకు మంచి శుభ సూచిక. ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ చొరవతో , అధికారులందరూ సమయం ఎంత పని చేయాలన్నారు.

## భిక్నూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ

**- ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలి**
**- ఎస్పీ యం. రాజేష్ చంద్ర,**



కామారెడ్డి బ్యూరో జున్ 16(విజన్ఆంధ్ర): కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, మంగళవారం భిక్నూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి స్టేషన్ పరిసరాలు, పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమై రోల్ కాల్ ప్రాముఖ్యతను వివరించి, వారు నిర్వహిస్తున్న విధులు, బాధ్యతలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన ఆర్థిక నేరాలు, దొంగతనాలు, ఇతర కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ కేసులను ప్రాధాన్యతగా తీసుకుని ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నేరాల నియంత్రణలో భాగంగా విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు పగలు, రాత్రి గస్తీని పెంచాలని సూచించారు. తరచూ వాహనాల తనిఖీలు, నాకాబందీలు నిర్వహిస్తూ అనుమానిత వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, కేడీలు, నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, రోడ్డు భద్రత అంశాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని భిక్నూర్ ఎస్‌హెచ్‌వోకు సూచించారు. గ్రామాలు, కాలనీల్లో ప్రజలతో మమేకమవుతూ పోలీసులపై విశ్వాసం పెంపొందించేలా కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధత, వృత్తి నైపుణ్యంతో పనిచేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలను ఓపికగా విని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణానికి స్థల పరిశీలన

**అల్పాహారం కార్యక్రమానికి జిల్లాలో 22 పాఠశాలల ఎంపిక,జిల్లా అంతటా అల్పాహారాన్ని అందించే కార్యక్రమానికి శ్రీకారం**





మేడ్చల్ మల్లికార్జున జిల్లా జూన్ 16 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): ఆంధ్ర ప్రతినిధి : ప్రభుత్వ పాఠశాలలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహారం కార్యక్రమానికి జిల్లాలో 22 పాఠశాలల ఎంపికైన సందర్భంగా కేంద్రీకృత వంటగది నిర్మాణానికి గాను స్థల సేకరణ నిమిత్తం ఆలియాబాదు, కేశవరం లోని మూసిఉన్న బిసి ప్రీమెట్రిక్ హాస్టల్స్ ను మంగళవారం జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,జిల్లా అంతటా అల్పాహారాన్ని అందించే విధంగా ఉండేందుకు సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణానికి గాను స్థల పరిశీలనకై శామీర్ పేట్, మూడుచింతలపల్లి మండలాలలోని హాస్టల్స్ ను తనిఖీ చేస్తున్నామన్నారు. ఈ హాస్టల్స్ ఎప్పటి నుండి మూసి ఉన్నాయని, ఎంత స్థలం ఉందని బిసి వెల్ఫేర్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఈ రెండు హాస్టల్స్ స్థల వివరాల నివేదికను తనకు అందజేయాలని సంబంధిత ఎంఆర్ఓలకు సూచించారు. అనంతరం కేశవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసారు. విద్యార్థులు ఎంత మంది హాజరైనారని సంబంధితగ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఎన్నికొత్త అడ్మిషన్లు అయ్యాయని అడిగారు. పిల్లలతో ముచ్చటిస్తూ భోజనం ఎలా ఉంది, ఆడుకోవడానికి పరికరాలు ఉన్నాయా, ఏమైనా కావాలా అని విద్యార్థులను అడుగగా, ఫుట్ బాల్, క్రికెట్ కిట్లు కావాలని విద్యార్థులు కోరగా, కలెక్టర్ అందిస్తామన్నారు. ఈ పర్యటనలో జిల్లా బిసి వెల్ఫేర్ ఆఫీసర్ ఝాన్సీరాణి, శామీర్ పేట్ ఎంఆర్ఓ శ్రీనివాస్, మూడుచింతలపల్లి ఎంఆర్ఓ మహమ్మద్ ఇద్రీస్, టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అల్పాహార నిర్వహణ కాంట్రాక్టు ఏజెన్సీ మన్న ట్రస్ట్ వారితో కలెక్టర్ మాట్లాడుతూ వివరాలు అడిగి తెలుసుకొని అవసరమైన సలహాలు సూచనలు అందజేసారు.

# జిల్లా యువత మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

- **బోర్ఖడే హేమంత్ సహదేవరావు కలెక్టర్**
- **జూన్ 17న ఇంచర్ల ఎం.ఆర్. గార్డెన్‌లో మెగా జాబ్ మేళా2026లి**
- **70కి పైగా ప్రముఖ కంపెనీలు హాజరు : వేలాది ఉద్యోగ అవకాశాలు**
- **విజయవంతానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం**



ములుగు జూన్ 16, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ నెల 17వ తేదీ బుధవారం ఇంచర్లలోని ఎం.ఆర్. గార్డెన్‌లో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా2026లి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్, ఐపీఎస్‌తో కలిసి ఇంచర్లలోని ఎం.ఆర్. ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో జాబ్ మేళాకు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమ ప్రాంగణంలో తాగునీరు, భోజనం, కూర్చునే వసతి, పార్కింగ్, షేడ్ తదితర ఏర్పాట్లు పూర్తి స్థాయిలో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 70కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొనే ఈ మెగా జాబ్ మేళాలో విద్యార్హతలు, నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నందున కంపెనీల వారీగా ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి, అభ్యర్థులు సులభంగా ఇంటర్వ్యూలకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా యువత ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించి తమ కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

## తిరుమల పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



తిరుపతి : తిరుమలలో చదువుకునే అదృష్టం రావడం, స్వామివారి ఆశీస్సులతో నేడు పయనించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని తిరుమల ఎస్వీ హైస్కూల్లో పదవ తరగతి చదివిన 1991-92 లో బ్యాచ్ విద్యార్థులు తమ చిన్ననాటి స్నేహాన్ని మరోసారి గుర్తు చేసుకున్నారు. దాదాపు 34 సంవత్సరాలు తర్వాత అందరూ కలిసి, ఆనాటి జ్ఞాపకాలను, మధురానుభూతులను మనసారా గుర్తుచేసుకొన్నారు. ఒక్కసారిగా చిన్నతనానికి వెళ్లిపోయి పాఠశాల విద్యార్థులుగా మారిపోయి ఆటలతో, పాటలతో హోరెత్తించారు. తిరుపతి సమీపంలోని దుర్గ సముద్రంలో మామిడి తోటలో ఆత్మీయంగా ఒకరికొకరి కలుసుకొని కష్టసుఖాలు తెలుసుకుంటూ చిన్ననాటి స్నేహాన్ని మనసారా తలుచుకొని భావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపించిన మునిరాము, మమత, రాధిక, భాస్కర్, రెడ్డి శేఖర్, దాచేపల్లి కిరణ్ తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు.

# ఘనంగా హెచ్ఎస్ బీసీ రగ్బీ ప్రీమియర్ లీగ్-2 ప్రారంభం

**-హాజరైన రాష్ట్ర క్రీడలు, యువజన వ్యవహారాల మంత్రి వాకిటి శ్రీహరి**




హైదరాబాద్, జూన్ 16 (విజన్ ఆంధ్ర) : ఈనెల 16 నుంచి 28 వరకు జరగనున్న హెచ్ఎస్ బీసీ రగ్బీ ప్రీమియర్ లీగ్(ఆర్పీఎల్) పవర్డ్ బై ఏవిడ్ సీజన్-2 గచ్చిబౌలి స్టేడియంలో మంగళవారం ఘనంగా ప్రారంభమైందని నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రగ్బీ ఇండియా భాగస్వామ్యంతో జీఎంఆర్ స్పోర్ట్స్ నిర్వహిస్తున్న ఈ లీగ్‌లో ఆరు పురుషుల ఫ్రాంచైజీలతో పాటు తొలిసారిగా నాలుగు మహిళల ఫ్రాంచైజీలు పాల్గొంటున్నట్లు చెప్పారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలంగాణ క్రీడలు, యువజన వ్యవహారాల మంత్రి వాకిటి శ్రీహరి, జీఎంఆర్ గ్రూప్ కార్పొరేట్ చైర్మన్ కిరణ్ కుమార్ గ్రాంధి, రగ్బీ ఇండియా అధ్యక్షుడు రాహుల్ బోస్, నటి-గాయని శృతి హాసన్ పాల్గొని మహిళల ట్రోఫీని ఆవిష్కరించినట్లు చెప్పారు. మంత్రి వాకిటి శ్రీహరి తెలంగాణ క్రీడలకు ప్రధాన కేంద్రంగా ఎదుగుతోందని పేర్కొనగా, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధిని వివరించారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఉపాధ్యక్షురాలు, ఎండీ ఎ.సోని బాల దేవి లీగ్ నిర్వహణకు పూర్తి సహకారం అందించామని తెలిపారు. రగ్బీ ఇండియా అధ్యక్షుడు రాహుల్ బోస్ ఈ సీజన్‌లో 20 దేశాల ఆటగాళ్లు పాల్గొంటున్నారని, మహిళల పోటీ ప్రవేశపెట్టడం చారిత్రాత్మకమని చెప్పారు. జీఎంఆర్ స్పోర్ట్స్ సిఎంఓ సుజాయ్ గంగూలీ భారతదేశంలో ప్రపంచ స్థాయి రగ్బీ వ్యవస్థ నిర్మాణానికి సీజన్-2 కీలక ముందడుగని పేర్కొన్నారు.

# మన మట్టి.. మన చెట్టు.. మన హక్కు!!

- టేకు చెట్లపై తెలంగాణ రైతులకు 'విముక్తి' లభించేదెన్నడు?
- ఒక మహారాష్ట్ర నిర్ణయం.. కొన్ని లక్షల తెలంగాణ గుండెల ఆశ!







**హైదరాబాద్, జూన్ 16:**
రైతు చేను చుట్టూ నాటిన ప్రతి టేకు మొక్కా.. కేవలం ఒక చెట్టు కాదు, ఆ ఇంట్లో పెరిగే ఒక బిడ్డతో సమానం. కూతురి పెళ్లికో, కొడుకు చదువుకో, ఇల్లు గడవడానికో అక్కరకొస్తుందని పదేళ్లపాటు కంటికి రెప్పలా కాపాడుకున్న ఆ 'ఆకుపచ్చని బంగారం' చేతికొచ్చేసరికి.. రైతుకు ఎదురయ్యే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. తను పెంచిన చెట్టును నరుక్కోవాలన్నా, మార్కెట్‌కు తరలించాలన్నా అటవీ శాఖ చుట్టూ, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాలి. పర్మిషన్ల పేరిట నలిగిపోవాలి, అవినీతి వేధింపులకు గురికావాలి. పక్కనే ఉన్న మహారాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ భూముల్లో పెంచే టేకు చెట్ల నరికివేతకు, రవాణాకు ఫారెస్ట్ పర్మిషన్లు, ట్రాన్సిట్ పాస్‌ల నిబంధనలను పూర్తిగా రద్దు చేస్తూ విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. మరి మన బంగారు తెలంగాణలో ఈ విముక్తి ఎప్పుడు వస్తుంది? మన రైతులకు ఈ వెసులుబాటు కల్పిస్తే ఎంతటి అద్భుతమైన ఫలితాలు వస్తాయో ప్రభుత్వాలు ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది.

### కూతురి పెళ్లికి 'టేకు' నీడ.. కానీ పర్మిషన్ల వేదన!!

తెలంగాణ మట్టికి, ఇక్కడి వాతావరణానికి టేకు తోటలు ఎంతో అనుకూలం. ఎంతోమంది రైతులు, సామాన్యులు తమ సొంత స్థలాల్లో, పొలం గట్ల వెంబడి భవిష్యత్తు పెట్టుబడిగా టేకు మొక్కలు నాటుతున్నారు. కానీ, తీరా ఆ చెట్టు పెరిగి పెద్దదై, ఇంట్లో ఒక శుభకార్యానికి నిధులు అవసరమైనప్పుడు.. ఆ చెట్టును నరకడానికి అటవీ శాఖ అనుమతుల కోసం నెలల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. "నా కూతురి పెళ్లి కోసం పదేళ్ల క్రితం పొలం గట్టున టేకు చెట్లు వేశాను. ఇప్పుడు పెళ్లి ఖర్చుల కోసం వాటిని అమ్ముకుందామంటే ఆఫీసుల చుట్టూ తిరగడానికే సగం ప్రాణం పోతోంది. నా చేత్తో నాటిన చెట్టును నరుక్కోవడానికి నేనెందుకు ఇన్ని తిప్పలు పడాలి?" అని ఒక సగటు తెలంగాణ రైతు కన్నీటి పర్యంతమవుతున్నాడు.



### ఈ వెసులుబాటు కల్పిస్తే.. తెలంగాణ రైతులకు కలిగే 'లబ్ధి' ఇదే:

### రైతులకు ఆర్థిక భరోసా

టేకుపై ఆంక్షలు తొలగిస్తే, అది రైతులకు ఒక 'గ్రీన్ ఫిక్స్‌డ్ డిపాజిట్'లా మారుతుంది. అవసరమైనప్పుడు తక్షణమే కలపను అమ్ముకుని ఆర్థిక ఇబ్బందుల నుండి గట్టెక్కవచ్చు.

### దళారీల దోపిడీకి చెక్

అటవీ శాఖ అనుమతుల పేరుతో మధ్యవర్తులు, దళారీలు రైతులను నిలువునా దోచుకుంటున్నారు. ఈ నిబంధన రద్దయితే.. రైతులు నేరుగా కలప మిల్లుల యజమానులతో మాట్లాడి సరైన మద్దతు ధర పొందవచ్చు.

### హరిత హారానికి అసలైన ఊతం

ప్రభుత్వ ఆంక్షల భయం వల్లే చాలామంది రైతులు టేకు లాంటి విలువైన చెట్లను నాటడానికి వెనకాడుతున్నారు. స్వేచ్ఛ కల్పిస్తే.. ప్రతి రైతు తన పొలం గట్టున వందలాది టేకు మొక్కలు నాటుతాడు. తద్వారా రాష్ట్రంలో పచ్చదనం అప్రయత్నంగానే వెల్లివిరుస్తుంది.

### గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త వెలుగు

వ్యవసాయం లాభసాటిగా లేని రోజుల్లో ఈ 'అగ్రో ఫారెస్ట్రీ' (వ్యవసాయ అడవుల పెంపకం) రైతుల పాలిట వరంలా మారుతుంది. భవిష్యత్తులో కార్బన్ క్రెడిట్స్ ద్వారా కూడా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుంది.

### పాలకులారా.. పచ్చని మనసుతో ఆలోచించండి!!

తెలంగాణ ప్రభుత్వం ఎన్నో రైతు సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. కానీ, రూపాయి ఖర్చు లేకుండా రైతుకు కొండంత లాభాన్ని, మానసిక ప్రశాంతతను చేకూర్చే ఇలాంటి 'పాలసీ మార్పు'పై కూడా దృష్టి పెట్టాలి. మహారాష్ట్ర తరహాలోనే తెలంగాణలో కూడా ప్రైవేట్ భూముల్లోని టేకు చెట్లపై అటవీ శాఖ ఆంక్షలను పూర్తిగా ఎత్తివేయాలి. తమ రక్తాన్ని చెమటగా మార్చి పెంచిన ఆకుపచ్చని సంపదపై రైతుకు పూర్తి హక్కును కల్పించండి. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే వేదనను తప్పించండి. తెలంగాణ అన్నదాతల కళ్లల్లో ఆనందం చూడాలంటే.. ఈ అద్భుతమైన వెసులుబాటు తక్షణ అవసరం.

**- గడ్డం సంతోష్ రాజ్**
**స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)**

# గౌడ్‌ల అభ్యున్నతికి ఈసీజీ సేవలు ఆదర్శనీయం

- **డాక్టర్ బండి సాయన్న గౌడ్**
- **విద్యతోనే సమాజ ప్రగతి సాధ్యం**
- **ఆంధ్రప్రదేశ్‌లో గోపా రాష్ట్ర శాఖ ఏర్పాటు అవసరం**
- **ప్రతిభను ప్రోత్సహిస్తేనే భావి భారతం బలోపేతం**
- **ఆడపిల్ల చదువు సమాజానికి వెలుగునిచ్చే మహాశక్తి**









అమరావతి, ఆంధ్రప్రదేశ్: గౌడ్ సమాజ అభ్యున్నతికి విద్యనే ప్రధాన ఆయుధంగా భావించి విద్యా, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఎడ్యుకేషన్ అండ్ కెరీర్ కౌన్సిలింగ్ ఫర్ గౌడ్స్ (ఈసీజీ) సంస్థ సేవలు ఆదర్శప్రాయమని తెలంగాణ రాష్ట్ర గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బండి సాయన్న గౌడ్ పేర్కొన్నారు. అమరావతిలో ఈసీజీ ఆధ్వర్యంలో పదో తరగతి మరియు ఇంటర్మీడియట్ (12వ తరగతి) పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయన్న గౌడ్ మాట్లాడుతూ, "విద్య మాత్రమే జీవితాలను మార్చగల మహాశక్తి. సమాజంలోని అనేక సమస్యలకు పరిష్కారం చూపగల సాధనం చదువు. చదువుకున్న వ్యక్తి దేశానికి శక్తి, కుటుంబానికి ఆధారం. ఆడపిల్ల చదువు సమాజానికి వెలుగు. ప్రతి గౌడ్ కుటుంబం తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలి" అని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో గౌడ్ అధికారుల, ఉద్యోగుల, వృత్తి నిపుణుల సమన్వయంతో సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖను తక్షణమే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. దీనివల్ల సమాజ అభివృద్ధికి మరింత బలం చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ పలగాని శ్రీనివాస్ రావు గౌడ్ సభాధ్యక్షత వహించారు. గోపా ఉపాధ్యక్షులు చెక్కిళ్ల మధుసూదన్ గౌడ్ మాట్లాడుతూ గౌడ్ జాతి చరిత్ర, సాంస్కృతిక వైభవం, సమాజ సేవా సంప్రదాయాలను వివరించారు. గౌడ్ కుటుంబ సభ్యులు తమ పేర్లకు విధిగా "గౌడ్" అనే ఇంటిపేరును జోడించడం ద్వారా సామాజిక గుర్తింపును బలోపేతం చేసుకోవచ్చని అభిప్రాయపడ్డారు. గోపా ఆర్గనైజింగ్ సెక్రటరీలు మరిపల్లి కళ్యాణ్ చక్రవర్తి గౌడ్, గుడేపూరి సాయి వేణు గౌడ్ విద్య ప్రాధాన్యతను సవివరంగా వివరిస్తూ, జనాభా ప్రాతిపదికన గౌడ్ సమాజానికి లభించాల్సిన అవకాశాలు, ప్రాతినిధ్యాన్ని సాధించేందుకు యువత విద్య, అవగాహన, సామాజిక చైతన్యంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గోపా స్వర్ణోత్సవాల సందర్భంగా ప్రచురించిన గోపా సావెనీర్‌ను సభలో ఆవిష్కరించారు. అదేవిధంగా స్థానిక నాయకులు డాక్టర్ ఈ.వి. నారాయణరావు గౌడ్, మారుబోయిన శివప్రసాద్ గౌడ్, మేక శేషగిరిరావు గౌడ్, డాక్టర్ చప్పిడి కృష్ణ గౌడ్, రాయన శాంతికుమార్ గౌడ్, చిటికెన మురళీకృష్ణ గౌడ్, చిలక చంద్రమౌళి గౌడ్, వాక రాంగోపాల్ గౌడ్, చెల్లుబోయిన శ్రీనివాస్ గౌడ్, కారంకి రంగారావు గౌడ్, వెంకటేశ్వర్లు గౌడ్, కంచెర్ల కాశయ్య గౌడ్, సాంబశివరావు గౌడ్, వీరంకి రాజ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొని విద్య ప్రాధాన్యత, గౌడ్ సమాజ ఐక్యత, యువత భవిష్యత్ నిర్మాణంపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా భావితరాల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, సమాజ అభ్యున్నతికి బాటలు వేయవచ్చని వక్తలు అభిప్రాయపడ్డారు. విద్య ద్వారా సమాజ పురోగతిని సాధించాలనే లక్ష్యంతో ఈసీజీ మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి గౌడ్ సమాజానికి మార్గదర్శకంగా నిలవాలని పలువురు ఆకాంక్షించారు.

## 'పొగాకు వద్దు - ఆరోగ్యవంతమైన జీవితం ముద్దు'

- **'వరల్డ్ నో టొబాకో డే' సందర్భంగా భారీ ర్యాలీ**
- **పొగాకు వ్యసనం ఆకర్షణను బయటపెట్టి ఎదుర్కోవాలి: డీఎంహెచ్ఓ డా. గోపాల్ రావు**



ములుగు జూన్ 16, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలో 'వరల్డ్ నో టొబాకో' ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి లిజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. గోపాల్ రావులి మాట్లాడుతూ, 'నికోటిన్ , పొగాకు వ్యసనం యొక్క ఆకర్షణను బయటపెట్టి, దానిని ఎదుర్కొనడం' అనేది ఈ ఏడాది వరల్డ్ నో టొబాకో డే ప్రధాన నినాదం అని తెలిపారు. 'పొగాకు వద్దు- ఆరోగ్యవంతమైన జీవితం ముద్దు' అనే సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని వైద్య సిబ్బందికి పిలుపునిచ్చారు. గ్రామాల్లో పొగాకు, సిగరెట్, బీడీ, గుట్కా వంటి వాటి వాడకం వల్ల క్యాన్సర్, గుండె జబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధులు, స్ట్రోక్ వంటి ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తున్నాయని ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. యువత, పిల్లలు పొగాకు బారిన పడకుండా చూడాలని, ఇప్పటికే అలవాటు ఉన్నవారిని మాన్పించేలా కృషి చేయాలని సూచించారు. ధూమపానం చేసే వారికి కలిగే ఆరోగ్య సమస్యలు వారికే పరిమితం కాకుండా, చుట్టూ ఉన్న కుటుంబ సభ్యులు, పిల్లలు కూడా పరోక్షంగా అనారోగ్యం బారిన పడతారని వివరించారు. పొగాకు వాడకం వల్ల కేవలం వ్యక్తిగత ఆరోగ్యమే కాకుండా ఆర్థికంగా, పర్యావరణ పరంగా కూడా తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలిపారు. పొగాకు వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై భారం పడుతుందని, పర్యావరణ హాని కూడా కలుగుతుందని పేర్కొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.